ఆదివారం
31-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 189
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'అంతర్జాల' ఉపగ్రహం ప్రయోగం విజయవంతం

బీజింగ్: చైనా శనివారం కీలక ప్రయోగాన్ని చేపట్టింది. వాయువ్య చైనాలోని జ్యుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి ఉపగ్రహ అంతర్జాల సాంకేతికతల కోసం శాటిలైట్‌ను శనివారం పరీక్షించింది. లాంగ్ మార్చ్-2సీ కారియర్ రాకెట్ ద్వారా ఉదయం 8.13 గంటలకు (బీజింగ్ కాలమానం) ఈ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది. అది నిర్దేశిత కక్షకు చేరుకున్నది. దీంతో ప్రయోగం విజయవంతం అయిందని చైనా ప్రకటించింది. లాంగ్ మార్చ్ రాకెట్ సిరీస్‌లో ఇది 505వ మిషన్‌గా వెల్లడించింది

2న వైసీపీ జాబితా?

- కొలిక్కిరాని కసరత్తు
- ఎమ్మెల్యేలను వీడని టెన్షన్
- వెనక్కి తగ్గని ఎమ్మెల్యే ఆర్కే
- గాజువాక సీటుపై రచ్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ఇన్‌చార్జిల రెండో జాబితా విడుదల వాయిదా పడింది. మరో మూడు జిల్లాల సమీక్ష పూర్తికాకపోవడం, నూతన సంవత్సరంలో ప్రారంభించబోయే కార్యక్రమాలపై సీఎం జగన్ నిమగ్నమవ్వడంతో తుది జాబితా కొలిక్కిరాలేదు. వాస్తవంగా ఇప్పటికే మలి విడత జాబితా విడుదల చేస్తారని అందరూ భావించారు. మరోసారి ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల అభిప్రాయాలు తీసుకుని జనవరి 2 లేదా ఆ తర్వాత జాబితా విడుదలకు సీఎం సిద్ధమైనట్లు తెలిసింది. నాలుగు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో వైసీపీ అభ్యర్థుల జాబితాను ముందుగా ప్రకటించేందుకు వైసీపీ అధినేత జగన్ సిద్ధమయ్యారు. అయినా ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలతో మరోసారి వేర్వేరుగా సీఎం భేటీలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, విజయనగరం జిల్లాల సమీక్ష ఇంకా పూర్తి కాలేదు. ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి పిలిపిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు సీఎంను కలిశారు. ఇంకా కొందరికి పిలుపు రావాల్సి ఉంది. తొలివిడతగా 11మంది ఇన్‌చార్జిలను జగన్ ప్రకటించారు. 50 నుంచి 60 స్థానాల్లో ఇన్‌చార్జిల మార్పుపై కసరత్తు జరుగుతోంది. అనంతపురం, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల జాబితా సిద్ధమైంది. ఇన్‌చార్జిల మార్పులో మంత్రులు కూడా ఉన్నారు. కొన్ని స్థానాల్లో ఎంపీలను, కొత్తవారిని బరిలో దింపనున్నారు. జాబితా వాయిదా పడటంతో ఎమ్మెల్యేల్లో ఆందోళన కొనసాగుతోంది. తమకు టికెట్లు వస్తాయా లేదా అనే సందేహంతో వైసీపీ ముఖ్యనేతలతో మంతనాలు కొనసాగిస్తున్నారు. టికెట్లు దక్కని వారిని ప్రాంతీయ సమన్వయకర్తలు బుజ్జగిస్తున్నారు. ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పిస్తామని హామీలిస్తున్నారు. అయినా చాలామంది వెనక్కి తగ్గడంలేదు. కొందరు పార్టీ బాటలోనే నడుచుకుంటామని ప్రకటనలు చేస్తున్నారు.

పట్టువీడని అసంతృప్తి ఎమ్మెల్యేలు

అసంతృప్తి ఎమ్మెల్యేలు పట్టువీడటం లేదు. టికెట్లు దక్కని వారంతా పార్టీ ముఖ్యనేతలకు అందుబాటులోకి రావడం లేదు. మరికొందరు తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. తాజాగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిలతోనే తన రాజకీయ ప్రస్థానమని తేల్చిచెప్పడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అదే బాటలో ఉన్నారు. టికెట్టు రాదని తెలిసిన ఎమ్మెల్యే ఎలిజా భారీగా తన అనుచరులతో కార్ల ర్యాలీతో తాడేపల్లికి చేరుకుని...అవకాశం కల్పించాలని మరోసారి కోరారు. అయినా అధిష్ఠానం దిగిరాకపోవడంతో వారికి దిక్కుతోచడం లేదు. దీంతో పక్క పార్టీ వైపు చూస్తున్నారు. వైసీపీలో టికెట్లు రాని ఎమ్మెల్యేలకు జనసేన, టీడీపీ నేతలు వలవేస్తున్నారు. ఎవరైనా పార్టీ మారితే...అక్కడ వెంటనే ఇన్‌చార్జిలను వైసీపీ ప్రకటించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చాలామంది అసంతృప్తి ఉన్నా...ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రెండో జాబితా ప్రకటన అనంతరం నిర్ణయం తీసుకునేలా ఎదురుచూస్తున్నారు. సీఎం క్యాంప్ కార్యాలయానికి ఇంకా ఎమ్మెల్యేల పిలుపులు కొనసాగుతున్నాయి.

వైవీ సుబ్బారెడ్డికి నిరసన సెగ

గాజువాక వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో గందరగోళం నెలకొంది. సెట్టింగ్ ఎమ్మెల్యే నాగిరెడ్డికి టికెట్ ఇవ్వాలని ఆయన అనుచరులు పట్టుపట్టారు. సమావేశానికి వచ్చిన వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ఎదుట నాగిరెడ్డి వర్గీయులు నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన చందు నాయకత్వాన్ని తాము అంగీకరించబోమంటూ నినదించారు. ఇటీవల గాజువాక వైసీపీ ఇన్‌చార్జిని మారుస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో ఈ నిరసన సెగ మొదలైంది.

కదంతొక్కిన మున్సిపల్ కార్మికులు

- జనవరి 3 నుంచి సమ్మెకు సన్నద్ధం
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు, రాస్తారోకోలు
- ఉద్యోగ, కార్మికులపై సీఎం నిర్లక్ష్యం : జేఏసీ కన్వీనర్ పోరుమామిళ్ల
- చర్చలతో కాలయాపన : ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

2 లో

మున్సిపల్ సమ్మెకు సన్నాహకంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు శనివారం ఆందోళనలు నిర్వహించారు. జనవరి 3 నుంచి మున్సిపల్ జేఏసీ సమ్మెకు దిగనున్న సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ అధ్వర్యంలో అన్ని జిల్లాల్లోనూ ప్రదర్శనలు, రాస్తారోకోలు చేపట్టారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధిత మున్సిపల్ కార్మిక సంఘాల నేతలు పెద్దఎత్తున ప్రదర్శనల్లో పాల్గొన్నారు

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

- మంత్రుల ఇళ్లు ముట్టడి
- అడ్డుకున్న పోలీసులు... తోపులాట... ఉద్రిక్తత

అంగన్‌వాడీలు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రుల ఇళ్లు ముట్టడించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు.

2 లో

ఏమున్నది గర్వకారణం?

నిరసన, అసమ్మతి, అసహనం, అరాచకం, ఆందోళన, అవినీతి, అన్యాయాలు, అక్రమాలు, ఆకలికేకలు, అప్పులు, అభివృద్ధిపై అబద్ధాలు... ఇవి తప్ప గడిచిన 2023వ సంవత్సరంలో భారతదేశంలో చెప్పుకోవడానికి ఏమున్నది గర్వకారణం?

3 లో

ముస్లిం జనాభాపై అపోహలు రాజకీయ కల్పితాలే

మాజీ సీఈసీ ఖురేషీ

8 లో

పార్లమెంటు, కాగ్, ఈసీ కుదేలు

- మోదీ నియంత్రణలో కీలక సంస్థలు
- విధేయులకే కీలక పదవులు
- ఒక్కొక్కటిగా కూలుతున్న ప్రజాస్వామ్య మూలస్థంభాలు
- విపక్ష రహిత దేశమే లక్ష్యంగా ముందుకు



న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం నిరంకుశత్వం కొనసాగుతోంది. ప్రతిపక్షం లేని దేశం కోసం కుట్ర చేస్తోంది. ప్రజాస్వామ్యంపై దాడులు ఆగడం లేదు. కీలక వ్యవస్థలను నిరంకుశంగా తన నియంత్రణలోకి తెచ్చుకున్నారు. పార్లమెంటు, ఎన్నికల సంఘం, కాగ్ వంటి వ్యవస్థలను సైతం వదిలిపెట్టలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హిందీ రాష్ట్రాల్లో బీజేపీ గెలుపుతో విజయగర్వంతో ఉన్న ప్రధాని మోదీ... అయోధ్యలో రామమందిరం పేరిట సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఆశిస్తున్నారు. మోదీ నిరంకుశత్వానికి పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిదర్శనంగా నిలిచాయి. అవి ఏకపక్షంగా జరిగాయి. ఎన్నడూలేని విధంగా విపక్షాల ఎంపీలను సస్పెండ్ చేశారు. మోదీ పట్టు బిగిస్తుండటంతో ప్రజాస్వామ్యానికి మూలస్థంభాలు ఒక్కొక్కటిగా కూలిపోతుండటానికి 2023 వత్సరం ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. మోదీ ఆశించినట్లు పదేళ్లలో కీలక వ్యవస్థల కేంద్రీకరణ, అధికారికీకరణ ప్రక్రియ పూర్తి అయింది. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనకు నచ్చిన ముఖ్యమంత్రులను ఎంపిక చేశారు. పార్లమెంటరీ బోర్డు ఆమోదం, కేంద్ర పరిశీలకుల నివేదిక వంటివి లేకుండానే ప్రక్రియ పూర్తిచేశారు. ఎమ్మెల్యేల మద్దతు ఉన్నవారు పదువులు చేపట్టే రోజులు కూడా పోయాయి. జెన్‌ఎక్స్ బీజేపీ సీఎంలు... ఎమ్మెల్యేలకు లేక ఓటర్లకు జవాబుదారీగా కాక అధిష్ఠానానికి విధేయులుగా ఉంటారు. అమిత్ షా విశ్వాసమే వారికి ముఖ్యం లేదంటే వారాల వ్యవధిలో పదవులు పోతాయి. ఇందుకు ఉత్తరాఖండ్ సీఎంగా తీరత్ సింగ్ రావత్ నాలుగు నెలల పదవీ కాలమే ఉదాహరణ. కొత్త ముఖ్యమంత్రులు భజన్ లాల్ శర్మ, మోహన్ యాదవ్, విష్ణుదేవ్ సాయి ఎంపిక పద్ధతి ప్రకారం జరిగింది. వారికి నుదిటిపై తిలకం... ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం స్పష్టమైంది. వీరు రాజకీయాలకు కొత్త కాకపోయినాగానీ పెద్దగా ఆదరణ లేని నాయకులు కాబట్టి మద్దతు కోసం అధిష్ఠానం వైపే చూస్తారు. విధేయులుగా ఉంటారు. అందుకే ఉన్నత స్థానాలను ఈ ముగ్గురికి కట్టబెట్టారు. కొత్త ముఖ్యమంత్రులు బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట చేసినది ప్రధానితో దిగిన ఫొటోలతో ఢిల్లీలో ఫుల్ పేజి ప్రకటలు ఇవ్వడం. వీరు ఆదిత్యనాథ్, మనోహర్ లాల్ ఖట్టర్‌ను ఆదర్శకం తీసుకుంటారు. ఎంతగా అంటే బహిరంగ ప్రదేశాల్లో మాంసం, గుడ్లు అమ్మకాలను నిషేధిస్తూ మధ్యప్రదేశ్ తొలి కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సరైన లక్ష్యాల అన్వేషణలో బుల్డోజర్లు వీధుల్లో తిరుగుతాయి.

పార్లమెంటు

శీతాకాల సమావేశాల్లో రికార్డు స్థాయిలో 146 మంది ప్రతిపక్ష ఎంపీలు సస్పెండ్ అయ్యారు. మోదీ హయాంలో పార్లమెంటులో బహిష్కరణలు, సస్పెన్షన్లు 71 రెట్లు పెరిగాయి. అవకాశం వచ్చిన వెంటనే సభ్యులను సస్పెండ్

- మిగతా 2 లో

అంగన్‌వాడీల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి

పది కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

ఏపీ సీఎం జగన్‌కు లేఖ

న్యూఢిల్లీ: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని పది కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. వేతనాల పెంపు, గ్రాట్యుటీతో పాటు అనేక సమస్యల పరిష్కారం కోసం 19 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నట్లు వెల్లడించాయి. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి శనివారం సంయుక్తంగా లేఖ రాశాయి. అంగన్‌వాడీ కార్మికులు, ఆయాల డిమాండ్లు పరిష్కరించి సమ్మె విరమింపచేయాలని సీఎంను కోరాయి. స్వయంగా జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి జగన్‌కు సూచించారు. సమ్మె చేస్తున్న యూనియన్లతో వెంటనే చర్చలు జరపాలని, ఈ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరాయి. కార్మికుల ప్రాథమిక హక్కులకు హామీనివ్వాలని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ డిమాండ్ చేశాయి. 2019 ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతో అంగన్‌వాడీలు సమ్మె చేయాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. తెలంగాణలో ఇచ్చే దానికంటే వెయ్యి రూపాయలు ఎక్కువగా ఇస్తామన్న హామీ ఏమైందని కార్మిక సంఘాలు ప్రశ్నించాయి. సమ్మె చేసే యూనియన్లతో చర్చలు విఫలం కావడం, సుప్రీంకోర్టు సూచించిన మేరకు గ్రాట్యుటీ, వేతనాల అమలుకు ప్రభుత్వం తిరస్కరించడం బాధాకరమని పేర్కొన్నాయి. సమ్మె భగ్నం చేసేందుకు ప్రభుత్వం బలవంతపు చర్యలకు పూనుకుంటోందని, కార్మికులను బెదిరిస్తోందని, తాళాలు బద్దలు కొట్టి అంగన్‌వాడీ కేంద్రాలు తెరిపిస్తోందని దుయ్యబట్టాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో బెదిరింపులకు చోటులేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని జగన్‌కు కార్మిక సంఘాలు సూచించాయి.

ఇదీ లోకం!

సారూ... మా కోసం పార్టీలు ఫిరాయించి మరీ సేవ చేయొద్దు, ఇంటి దగ్గర రెస్టు తీసుకోండి, పాపం!

రేపు నింగిలోకి పీఎస్ఎల్వీ సీ-58

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: పీఎస్ఎల్వీసీ-58 ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) సిద్ధమైంది. జనవరి ఒకటో తేదీన ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లబోతోంది. శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి పీఎస్ఎల్వీసీ- 58ను ప్రయోగిస్తారు. 480 కిలోల బరువున్న ఎక్స్‌పో -శాట్‌ను, కేరళ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన కిలో బరువున్న వీబై-శాటును ఈ రాకెట్ ద్వారా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఐదేళ్ల జీవితకాలం కలిగిన ఎక్స్‌పో శాటిలైట్ విభిన్నమైనది. ఎక్స్ కిరణాల ధ్రువనాన్ని అధ్యయనం చేయడం కోసం దీన్ని ఇస్రో రూపొందించింది. బెంగళూరులోని యూఆర్ రావు ఉపగ్రహ కేంద్రంలో ఇది రూపుదిద్దుకుంది. భూమికి 650 కిలోమీటర్ల తక్కువ దూరంలో పీఎస్ఎల్వీసీ- 58 ద్వారా ఈ ఉపగ్రహాన్ని చేర్చనున్నారు. టెలిస్కోప్‌లా పని చేసే ఈ ఉపగ్రహం దేశానికి ఎంతో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అన్నారు. పీఎస్ఎల్వీ సీ-58 ప్రయోగం తర్వాత జీఎస్ఎల్వీ మార్కు- 2ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది.

2023లో ఎనిమిది ప్రయోగాలు విజయవంతం కాగా 2024 కూడా విజయాల వత్సరంగా ఉంటుందని ఆకాంక్షిస్తోంది. అలాగే ప్రయోగాన్ని వీక్షించేందుకుగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది.

మేనిఫెస్టోలో అంగన్‌వాడీల సమస్య

టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర-కుప్పం : తమ సమస్యలు పరిష్కరించాలని 19 రోజులుగా అంగన్ వాడీ వర్కర్లు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. అంగన్‌వాడీల సమస్యను తమ పార్టీ మేనిఫెస్టోలో పెట్టి పరిష్కరిస్తామని చెప్పారు. శనివారం కుప్పంలో అంగన్‌వాడీల రిలే నిరాహారదీక్ష శిబిరానికి వెళ్లిన ఆయన వారి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల న్యాయ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ హయంలో రెండుసార్లు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచామని, ప్రస్తుత ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమస్యలపై ఆందోళనలకు దిగితే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ప్రభుత్వం మీ డిమాండ్లు పరిష్కరించకుంటే తాము అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామన్నారు. అంగన్‌వాడీలు ఐక్యంగా ఉంటే ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చినా అవి తాత్కాలికం మాత్రమేనన్నారు. 'మీరు నా నియోజకవర్గంలో పోరాడుతున్నారు. ఉద్యోగాల నుంచి ఇప్పుడు మిమ్మల్ని అధికారులు తీసేస్తే నేను వచ్చాక మళ్లీ నియమిస్తా. ప్రజాస్వామ్యంలో పోరాడే హక్కు అందరికీ ఉంది. ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ 14 ఏళ్లు సీఎంగా చేసిన అనుభవం నాకు ఉంది. ఆందోళనలు చేసేవారిని నేనెప్పుడూ బెదిరించలేదు' అని తెలిపారు. అంతకుముందు, మైనారిటీ సోదరులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. మసీదులో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పెద్దపులి గంగమ్మ దేవాలయానికి వెళ్లారు. వేదపండితులు పూర్ణకుంభంతో

- మిగతా 2 లో

బ్రిక్స్ సభ్యత్వానికి అర్జెంటైనా తిరస్కృతి

బ్యూనోస్ ఎయిర్స్: బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాల కూటమి 'బ్రిక్స్' సభ్యత్వాన్ని అర్జెంటైనా అధికారికంగా తిరస్కరించింది. 2024, జనవరి ఒకటో తేదీ నుంచి అర్జెంటైనాతో పాటు ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సభ్యత్వ కాలం మొదలు కావాల్సి ఉంది. కీలక ఆర్థిక వ్యవస్థలతో కూడిన కూటమిలో భాగస్వామ్యం వద్దనుకున్నట్లు బ్రిక్స్ నేతలకు లేఖల ద్వారా అర్జెంటైనా అధ్యక్షుడు జేవియర్ మిలే తెలిపారు. దీనిని అధికారిక తిరస్కరణగా భావించాలని కోరారు. అర్జెంటైనా బ్రిక్స్ సభ్యత్వానికి ఇది సరైన సమయం కాదని లేఖల్లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాలకు తాను అనుసరించే విదేశాంగ విధానాలకు తేడా ఉందని, గత యంత్రాంగం నిర్ణయాలను పున:సమీక్షిస్తామని అధ్యక్షుడు మిలే పేర్కొన్నారు.

మెక్సికోలో కాల్పులు - ఆరుగురి మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో పుట్టినరోజు వేడుకలో విషాదం నెలకొంది. ఓ దుండగుడు కాల్పులకు తెగబడగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మందికి గాయాలయ్యాయి. ముఠా నాయకుడిపై ప్రత్యక్ష దాడి జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని సొనోరా ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటన కజేమీ మున్సిపాలిటీలో జరిగినట్లు పేర్కొంది. ఇటీవల కిస్మస్ పార్టీలో కాల్పులు జరిగి 11 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

క్యూబా విప్లవ స్ఫూర్తికి
ఈజిప్టు అభినందన

కైరో: క్యూబా విప్లవ స్ఫూర్తి భేష్ అని ఈజిప్టు కొనియాడింది. 65వ విప్లవ విజయోత్సవాన్ని పురస్కరించుకొని క్యూబాకు అభినందనలను ఈజిప్షియన్-క్యూబన్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ (సీఈఎఫ్) తెలిపింది. క్యూబాపై అమెరికా ఆంక్షలను ఖండించింది. ఈ మేరకు లేఖను కైరోలోని క్యూబా ఎంబసీకి సీఈఎఫ్ఏ అధ్యక్షుడు కమల్ గబల్లా పంపారు. క్యూబా విప్లవాలకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 1959, జనవరి ఒకటో తేదీ నుంచి కరేబియన్ ద్వీపాల్లో సాధించిన విజయాలకు సంఘీభావం తెలిపారు. విదేశీ కుట్రలను తిప్పికొట్టడంలో క్యూబా సమాజం కంకణబద్ధులుగా ఉండటాన్ని కొనియాడారు. క్యూబా అనిశ్చితికి జరిగే ప్రయత్నాలను ఆక్షేపించారు. రాజకీయంగానే కాకుండా మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడాన్ని దుయ్యబట్టారు. న్యాయమైన అరబ్ సమస్యలకు క్యూబా సంఘీభావం తెలపడాన్ని, పలస్తీనా సమస్య పరిష్కారానికి వెన్నంటే నిలిచినందుకు క్యూబాకు సీఈఎఫ్ఏ కృతజ్ఞతలు తెలిపింది. ఈజిప్టు, క్యూబా మధ్య స్నేహ, సహకార సంబంధాలు, సౌభ్రాతృత్వం మెరుగుదల కోసం కట్టుబడి ఉన్నట్లు సీఈఎఫ్ పేర్కొంది.

తక్కువ చార్జీలతో రైలు ప్రయాణం కావాలి

మోదీ నిలువెత్తు చిత్రం కాదు : రాహుల్

న్యూదిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ లైఫ్ సైజు కటౌట్‌లతో రైల్వే స్టేషన్‌లలో సెల్ఫీ బూత్‌లను ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రజలకు సులభమైన రైలు ప్రయాణం కావాలా లేదా 'షాహెన్‌షా విగ్రహం' ఉన్న చిత్రం కావాలా అని ప్రశ్నించారు. 'ఎక్స్'లో హిందీలో ఒక పోస్ట్‌లో రాహుల్ ఇలా పేర్కొన్నారు. భారతీయ రైల్వేలో 'గరీబో కి సవారీ'లోని ప్రతి తరగతికి చార్జీలు పెంచారు. వృద్ధులకు ఇచ్చే చార్జీల రాయితీని కూడా ఉపసంహరించుకున్నారు. ప్లాట్‌ఫారమ్ టికెట్ ధరలు పెంచారు. ప్రైవేటీకరణకు తలుపులు తెరిచారు' అని పేర్కొన్నారు. 'ప్రజల కష్టార్జిత సొమ్ములో నుంచి దోచుకుంటున్న ఈ డబ్బు సెల్ఫీ స్టాండ్ కోసం కాదా? భారత ప్రజలకు ఏం కోరుకుంటారు? చౌక గ్యాస్ సిలిండర్లు, సులభమైన రైలు ప్రయాణం? లేదా 'షాహెన్‌షా విగ్రహం' ఉన్న చిత్రమా? అని ప్రశ్నించారు. మోదీ ఫొటోలతో రైల్వే స్టేషన్లలో సెల్ఫీ బూత్‌లను ఏర్పాటు చేయడం పన్ను చెల్లింపుదారుల డబ్బును 'వృథా' చేశారు. అయితే ప్రతిపక్ష రాష్ట్రాలు 'ఉపాధి హామీ పథకం' నిధుల కోసం ఎదురు చూస్తున్నాయంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్న కొద్ది రోజుల తర్వాత కేంద్రంపై రాహుల్ ఈ విమర్శలు చేశారు.

ఇజ్రాయిల్ ఉగ్రదేశం: మిగుల్ డియాజ్

టెహ్రాన్: గాజాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్ తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్‌ను ఉగ్రదేశమని అన్నారు. అక్టోబరు 7 నుంచి గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న భీకర దాడుల్లో ఇప్పటికే 22వేల మందికిపైగా పలస్తీనియన్లు చనిపోగా మృతుల్లో 9వేల మంది వరకు పిల్లలు ఉన్నారు. లక్షలాది మంది పలస్తీనా పౌరుల జీవితాలను అస్తవ్యస్థం చేస్తూ, వేలాది మంది మరణాలకు దారితీస్తూ, గాజాను చిన్నాభిన్నం చేస్తూ దురాక్రమణను ఇజ్రాయిల్ కొనసాగిస్తోందని సామాజిక మాధ్యమాల్లో విమర్శించారు. ఇజ్రాయిల్ ప్రభుత్వానికి జవాబుదారీతనం లేకపోవడాన్ని ఆక్షేపించారు. పలస్తీనా కోసం తమ గళాన్ని క్యూబా ఎప్పుడూ వినిపిస్తుందని తెలిపారు. ఇజ్రాయిల్ దురాగతాలు, దమనకాండ, యుద్ధోన్మాదానికి క్యూబా పూర్తి వ్యతిరేకమని మిగుల్ డియాజ్ అన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే పోరు ఉధృతం: లలిత

విశాలాంధ్ర - విశాఖ : అంగన్‌వాడీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత అన్నారు. స్థానికంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం రిలే నిరాహార దీక్షలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా ఆరువేల మంది కార్మికులు 19 రోజులుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కడుపు కొట్టే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని చెప్పి నేడు మాట మారుస్తున్నారని సీఎంనుద్దేశించి ఆమె అన్నారు. కనీస వేతనం రూ.26వేలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి లేని చర్చలను మంత్రులు జరుపుతున్నారని, వాటిలో ఫలితం శూన్యమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఎస్‌జే అచ్యుతరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల రమణ, అంగన్‌వాడీ నాయకులు అనురాధ, సీత, శ్యామల పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: అంగన్‌వాడీలు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రుల ఇళ్లు ముట్టడించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా అక్కడక్కడా ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అంగన్‌వాడీలు, పోలీసుల మధ్య తోపులాట, అరెస్టులు చోటుచేసుకున్నాయి. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టంచేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె శనివారం 19వ రోజుకు చేరుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వివిధ రూపాల్లో కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేశారు. శనివారం అనేకచోట్ల మంత్రుల ఇళ్ల ముట్టడికి యత్నించారు. గుంటూరులోని శ్యామలానగర్‌లో మంత్రి విడదల రజిని ఇంటిని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ముట్టడించారు. దాదాపు నాలుగు నియోజకవర్గాల నుంచి అంగన్‌వాడీలు తరలివచ్చారు. ప్రభుత్వం స్పందించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమకు కనీస వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అంగన్‌వాడీల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతానని మంత్రి రజని తెలిపారు. అంగన్‌వాడీలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అందరి సమస్యలు పరిష్కరిస్తుందని చెప్పారు. మరోవైపు, ప్రకాశం జిల్లా మార్కాపురంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ ఇంటిని సైతం అంగన్‌వాడీలు ముట్టడించారు. మంత్రి ఇంటి ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. ఒంగోలులోని మంత్రి సురేశ్ క్యాంపు కార్యాలయాన్ని దిగ్బంధించారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఇంటి ముట్టడికి అంగన్‌వాడీలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను నాలుగో పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. శివారు ప్రాంతంలో వాహనాలు నిలిపి అంగన్‌వాడీలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అంగన్‌వాడీలు స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రి ఉషశ్రీ ఇంటిని అంగన్‌వాడీ కార్యకర్తలు ముట్టడించారు. జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు తరలివచ్చారు. మంత్రి ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి ఉషశ్రీ చరణ్ బయటికి రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సొంత శాఖలో అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే మంత్రి స్పందించడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి ఇంటి ముట్టడికి బయల్దేరిన అంగన్‌వాడీలను వెస్ట్ చర్చి కూడలి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో రాకపోకలను పోలీసులు దారిమళ్లించారు. విజయనగరంలో మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి ముట్టడికి అంగన్‌వాడీలు యత్నించారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటిని ముట్టడించగా...సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కదంతొక్కిన మున్సిపల్ కార్మికులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మున్సిపల్ సమ్మెకు సన్నాహకంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు శనివారం ఆందోళనలు నిర్వహించారు. జనవరి 3 నుంచి మున్సిపల్ జేఏసీ సమ్మెకు దిగనున్న సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ అధ్వర్యంలో అన్ని జిల్లాల్లోనూ ప్రదర్శనలు, రాస్తారోకోలు చేపట్టారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధిత మున్సిపల్ కార్మిక సంఘాల నేతలు పెద్దఎత్తున ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని నినదించారు. పారిశ్రామిక ప్రాంతమైన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన ర్యాలీలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ సీఎం జగన్ చర్చలతో కాలయాపన చేయకుండా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు జరుగుతున్నప్పుడు ప్రభుత్వం మొక్కుబడిగా స్పందిస్తేగానీ, ఒక్క సమస్యనూ పరిష్కరించడం లేదని విమర్శించారు. దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ సమ్మెకు టీడీపీ తరపున మద్దతిస్తామన్నారు. సిహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు జె.ప్రసాద్, బసవయ్య, సీపీఐ నాయకులు రమేశ్, మధుసూదనరావు తదితరులు నాయకత్వం వహించారు. గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కార్మికులు భారీ ర్యాలీ చేపట్టి, ట్రావెల్స్ బంగ్లా సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. హాజరయిన జేఏసీ కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేయమని వినతిపత్రాలు ఇద్దామని ప్రయత్నించినా సీఎం జగన్ మొఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ఏడు డీఏలు, సరెండర్ లీవ్ ప్రయోజనాలు నాలుగేళ్లు అవుతున్నప్పటికీ ఇంతవరకు విడుదల కాలేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలకే డబ్బుల్లేవంటూ కొత్త పాట పాడుతుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం దిల్లీ, పంజాబ్, ఒడిశా, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాల వలే సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, టైం స్కేల్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయడం లేదని అన్నారు. 11వ పీఆర్సీ ప్రకారం మూల వేతనం రూ.20 వేలు, డీఏ ఇతరత్రా ప్రయోజనాలను రూ.29 వేలు కల్పించాల్సి ఉందని తెలిపారు. గతంలో ఇచ్చే రూ.12 వేలకు రూ.3 వేలు పెంచి, మొత్తంగా రూ.15 వేలు చేశారని, దానివల్ల కార్మికులు రూ.14 వేల నష్టానికి గురవుతున్నారని వివరించారు. ఈ సమస్యలపై ఆందోళనలు చేసి వినతులిస్తే, వాటిని వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, దీంతో అంతిమంగా సమ్మెకు దిగుతున్నామన్నారు.

ఈ ప్రభుత్వం తన ఉద్యోగ, కార్మికులను శత్రువులుగా చూస్తోందని, అడ్డొస్తే కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజారోగ్యానికి ప్రమాదం కలగకుండా సమస్యలు పరిష్కరించి సమ్మె నివారించాలని తాము కోరుతుంటే, సీఎం జగన్ మాత్రం మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని, ఇది ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదన్నారు. జనవరి 3 నుంచి మున్సిపల్ జేఏసీ నిరవధిక సమ్మె చేస్తుందని, అక్రమ కేసులకు బెదరబోమన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ బందెల రవికుమార్, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ శంకర్రావు, టీఎన్‌టీయూసీ నాయకులు నారా జోషి, జనసేన కార్మిక సంఘం నాయకులు సోమి ఉదయ్ తదితరులు నాయకత్వం వహించారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాగా, తిరుపతిలో జరిగిన ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షులు అశుల రంగనాయకులు, విశాఖలో ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నరసాపురంలో ఉపాధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు, కాకినాడలో రాష్ట్ర నాయకులు తోకల ప్రసాద్, తాడేపల్లిగూడెంలో కోశాధికారి తాడికొండ వాసు నాయకత్వం వహించారు. అనంతపురంలో ఉపాధ్యక్షులు రాజేష్ గౌడ్, మంగళగిరిలో ఉపాధ్యక్షులు దుర్గారావు, బాపట్లలో వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, కర్నూలులో కార్యదర్శి పులగం మద్దిలేటి, అన్నమయ్య జిల్లాలో సురేష్, చిత్తూరులో నాగరాజన్, శ్రీకాకుళంలో కళ్యాణి అప్పలరాజు, విజయనగరంలో కామేష్, రాజమండ్రిలో దుర్గమ్మ, నంద్యాలలో సుంకన్న, ప్రకాశం జిల్లాలో హరిబాబు, మచిలీపట్నంలో కరపాటి సత్యనారాయణ, కనిగిరిలో నాసర్ వలి, గుంటూరులో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం, కె.వి.ఆంజనేయులు, చిన్న వెంకట్రావు, రాజా, లక్ష్మీ నారాయణ, కొండయ్య, రమణమ్మ, చెంచమ్మ, మోక్షరాణి, కమలమ్మ పాల్గొన్నారు.

పార్లమెంటు, కాగ్, ఈసీ కుదేలు

(మొదటిపేజీ తరువాయి)

చేయడమన్నది సభాపతులకు పారిపాటిగా మారింది. ఏ రోజుకు ఆ రోజు క్రమశిక్షణ ఉల్లంఘించిన వారి జాబితాను రూపొందించి... సస్పెండ్ చేయాల్సిన ఎంపీల పేర్లను లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ తాజా సమావేశాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఓ సందర్భంలో సభలో లేని ఎంపీని కూడా సస్పెండ్ చేసేవారి జాబితాలో చేర్చారు. అయితే తప్పును తెలుసుకొని దానిని సరిచేసుకున్నారు. పార్లమెంటు భద్రతా వైఫల్యం క్రమంలో ఈ తతంగం మొదలైంది. నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరించకుండా సభలోకి ప్రవేశించిన ఇద్దరు యువతకులతో పాటు వారికి మద్దతిచ్చిన వారిని ఉగ్రవాదులుగా ముద్రవేసి ఉపా చట్టం కింద కేసులు పెట్టారు. వీరికి పాసులు ఇచ్చిన బీజేపీ ఎంపీని కనీసం మందలించలేదు. నుదుట తిలకం... విభూతితో త్రిశూల నేపథ్యం ఉండటమే ఇందుకు కారణం! 'ప్రతిపక్ష రహిత' పార్లమెంటు 74శాతం పని చేసింది. 17వ లోక్‌సభలో కేవలం ఒకట్రెండు గంటలు చర్చించి బిల్లులను ఆమోదించారు.

కేవలం 16శాతం బిల్లులనే స్థాయి సంఘాలకు సిఫార్సు చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు, టెలి కమ్యూనికేషన్స్ బిల్లు, ప్రెస్-రిజిస్ట్రేషన్ పీరియాడికల్స్ బిల్లులను ఆఘమేఘాలపై ఆమోదింపజేయించిన తీరు సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.

ఎన్నికల సంఘం

ఈసీల నియామకాల పరిశీలనకు ఏర్పడిన ముగ్గురి ప్యానల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) తప్పించి ఆయన స్థానాన్ని ప్రధాని సిఫార్సు చేసిన మంత్రితో భర్తీ చేశారు. ఈసీల నియామకాల కొత్త బిల్లును తెచ్చారు. దీనిని రిటైర్డ్ జస్టిస్ రొహింగ్టన్ ఎఫ్ నారిమన్ దుయ్యబట్టారు. ఎన్నికల సంఘం స్వచ్ఛగా పనిచేయనివ్వని కొత్త చట్టాన్ని రద్దు చేయాలని ఆయన న్యాయవ్యవస్థకు సూచించారు.

కాగ్

మోదీ పాలనలో కాగ్ పూర్తిగా కుదేలైంది. కంప్ట్రోలర్ ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (కాగ్) అక్టోబరులో పూర్తిస్థాయిలో మూగబోయింది. 2020 ఆగస్టులో కాగ్‌గా గుజరాత్ కేడర్ అధికారి గిరీశ్ ముర్ము నియమాకం తర్వాత ఆ సంస్థ మౌనాన్ని ధరించింది. గిరీశ్ ముర్ము... మోదీకి నమ్మకస్తుడు. సీఎంగా ఉన్నప్పుడు మోదీకి ముఖ్యకార్యదర్శిగా ఉన్న గిరీశ్... అమిత్‌షాతోనూ పనిచేశారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోని కేసులపైనే దృష్టి పెట్టి, కేంద్ర ఖాతాలను పట్టించుకోకుండా ఉండే ముర్ము వ్యూహం పనిచేసింది. కానీ కేంద్ర ప్రాజెక్టులపై అనేక నివేదికలతో వచ్చినప్పుడు కాగ్‌పై సర్కార్ ఆగ్రహం వ్యక్తంచేసింది.

తమను కించపరిచే నివేదికలు రూపొందించిన అధికారులపై బదిలీ వేటు వేసింది. అవినీతి రహిత పాలన అని చెప్పుకునే మోదీ మాటలు అబద్ధాలని నిరూపించేలా, ఆయుష్మాన్ భారత్, ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే అమలులో అనేక అవకతవకలు జరిగినట్లు వాస్తవాలను బహిర్గతం చేసేవిగా నివేదికలు వెలువడ్డాయి. 2019 నుంచి 2023 వరకు కాగ్ నివేదికలు సగటున 22 మాత్రమే అని 'ది హిందూ' విశ్లేషణ పేర్కొంది. మోదీ రాకముందు ఆ సంఖ్య 40గా ఉంది.

ఏదిఏమైనా మోదీ అధికార దుర్వినియోగానికి అడ్డులేకుండా పోయింది. రెండుసార్లు అధికారంలోకి వచ్చి పదేళ్లలో తాను కోరుకున్నవన్నీ మోదీ చేసేశారు. మూడవసారి అధికారం కోసం ఆకాంక్షిస్తున్నారు. ఇందులో ఆయన సఫలమైతే గనుక ఇక కూల్చేందుకు మూల స్తంభాలేమీ మిగలి ఉండవన్నది వాస్తవం.

మేనిఫెస్టోలో అంగన్‌వాడీల సమస్య

(మొదటిపేజీ తరువాయి)

స్వాగతం పలికారు. అమ్మవారికి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుప్పం బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్న క్యాంటీన్‌ను సందర్శించి భోజన వితరణ చేశారు. మల్లానురులో రోడ్ షో నిర్వహించారు.

కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తాం

కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల సమీపంలో కురుబ భవనం వద్ద కురబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహాన్ని చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తామని ప్రకటించారు. కుప్పంలో కురుబ భవనానికి గతంలో తాను 1.7 ఎకరాల స్థలం ఇచ్చి రూ.50 లక్షల కేటాయించానని, 80 శాతం పూర్తి చేసిన భవనాన్ని నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా జగన్ వదిలేశారని మండిపడ్డారు. కనకదాసు విగ్రహం ప్రారంభించడం సంతోషంగా ఉందని, కుల వ్యవస్థపై కనకదాసు రాజీలేని పోరాటం చేశారన్నారు. కురుబ కులానికి చెందిన యువత కూడా బాగా చదువుకుని నేడు ఐటీ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇక్కడ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కురబ వర్గానికి చెందిన వారిని టీటీడీ మెంబర్‌గా నియమిస్తామని, సీట్లు ఇస్తామని, ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తామని చంద్రబాబు అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కురుబ కార్పొరేషన్‌కు రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఫాంలు ఏర్పాటు చేసి, సబ్సిడీ రుణాలు ఇస్తామన్నారు. గొర్రెల కాపరులకు రూ.10 లక్షల బీమా అందిస్తామని తెలిపారు. టీడీపీ వెనకబడిన వర్గాల పార్టీ అని, బీసీల అభ్యున్నతికి నిధులు కేటాయించడంతో పాటు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేస్తామన్నారు.

జగనన్న ఇళ్లపై సీబీఐ విచారణ

ప్రధాని మోదీకి పవన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్ల నిర్మాణం పేరిట భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి ఆయన శనివారం లేఖ రాశారు. 'వైసీపీ పాలనలో భూసేకరణ పేరిట రూ.32,141 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారు. ఇళ్ల పట్టాలు, నిర్మాణంపై ప్రభుత్వం భిన్న ప్రకటనలు చేస్తోంది. సీబీఐ వంటి సంస్థలతో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు తెలుస్తాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు భూ సేకరణలో కీలకంగా వ్యవహరించారు. గతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పూర్తిగా లబ్ధిదారులకు ఇవ్వలేదు. 6.68 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తయితే 86,984 మందికే ఇచ్చారు. ప్రభుత్వం తీరుతో మిగతా లబ్ధిదారులు విసుగుచెందారు' అని పవన్ తన లేఖలో పేర్కొన్నారు.

అయోధ్య రైల్వే స్టేషన్, విమానాశ్రయం ప్రారంభం

అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపన

అయోధ్య : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అయోధ్యలో మహర్షి వాల్మీకి విమానాశ్రయాన్ని, పునర్నిర్మాణం చేసిన రైల్వేస్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే రెండు అమృత్ భారత్ రైళ్లను, వర్చువల్‌గా ఆరు వందే భారత్ రైళ్లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అయోధ్యలో ఆధునీకరించిన రైల్వేస్టేషన్‌కు 'అయోధ్య ధామ్ జంక్షన్'గా నామకరణం చేశారు. రామ మందిరం వేడుక లేదా 'ప్రాణ ప్రతిష్ఠ' కార్యక్రమానికి కొన్ని వారాల ముందు ప్రధాని పర్యటించారు. ఈ ఆలయం ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. జనవరి 22న ఈ వేడుక జరగనుంది. దీనికి ప్రధాని హాజరవుతారు. రూ.15,700 కోట్ల కంటే ఎక్కువ విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. వీటిలో నగరం, దాని పరిసర ప్రాంతాల అభివృద్ధికి సుమారు రూ.11,100 కోట్ల విలువైన ప్రాజెక్టులు, ఉత్తర ప్రదేశ్‌లోని ఇతర పనులకు సంబంధించి రూ.4,600 కోట్ల విలువైన ప్రాజెక్టులు ఉన్నాయి. అంతకుముందు రోజు ప్రధాని మోదీ ఈ పట్టణానికి వచ్చిన తర్వాత విమానాశ్రయం నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్‌షో నిర్వహించారు. విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికిన ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, 'అయోధ్య ధామ్‌లో గౌరవనీయమైన ప్రధానికి హృదయపూర్వక స్వాగతం, శుభాకాంక్షలు' అని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. స్టేషన్‌ను ప్రారంభించిన తర్వాత ప్రధాని దానిని సందర్శించారు. ఆయన వెంట సీఎం ఆదిత్యనాథ్, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తదితరులు ఉన్నారు. సాంప్రదాయ ఆలయ వాస్తుశిల్పం నుంచి ప్రేరణ పొందిన ఈ స్టేషన్ ప్రధాన ద్వారం గురించి వైష్ణవ్ మోదీకి వివరించారు. రూ.240 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో పునరాభివృద్ధి చేయబడిన స్టేషన్ అయోధ్య ధామ్ జంక్షన్ రైల్వే స్టేషన్‌కు చెందిన మొదటి దశ పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి రెండు కొత్త అమృత్ భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. దర్భంగా-అయోధ్య-ఆనంద్ విహార్ టెర్మినల్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, మాల్దా టౌన్-సర్ ఎం విశ్వేశ్వరయ్య టెర్మినస్ (బెంగళూరు) అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. కాగా, ఆరు కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించిన వాటిలో శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా-న్యూదిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, అమృత్‌సర్-దిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూరు-బెంగళూరు కన్నాట్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు-మడ్గావ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, జల్నా-ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్, అయోధ్య-ఆనంద్ విహార్ టెర్మినల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. దీని తరువాత, ప్రధాని మోదీ లతా మంగేష్కర్ చౌక్‌ను సందర్శించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి (రిటైర్డ్) వీకే సింగ్, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, ముఖ్య నాయకులు మోదీ వెంట ఉన్నారు.

మీడియా సంస్థలపై దావా వేస్తా

లాలన్ సింగ్

పాట్నా : ఆర్‌జేడీ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై తిరుగుబాటుకు తాను కుట్ర పన్నానంటూ వచ్చిన మీడియా కథనాలపై జేడీ(యూ) మాజీ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్) శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి కథనాలు వెలువరించిన మీడియా సంస్థలపై పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు. పార్టీ అత్యున్నత పదవి నుంచి వైదొలిగిన ఒక రోజు తర్వాత లాలన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఒక ప్రధాన వార్తాపత్రిక, కొన్ని వార్తా చానళ్లలో ప్రసారమైన నివేదికలు పూర్తిగా తప్పుదారి పట్టించేవి. నా ప్రతిష్ఠను దిగజార్చడానికి ఉద్దేశించినవి' అని కఠిన పదాలతో కూడిన ఆ ప్రకటన పేర్కొంది. డిసెంబరు 20న బీహార్ మంత్రి నివాసంలో జరిగిన కొద్దిమంది జేడీ(యూ) ఎమ్మెల్యేల సమావేశానికి తాను హాజరయ్యానని ఈ నివేదికల్లో పేర్కొన్నది వాస్తవ విరుద్ధమని తెలిపారు. 'నేను ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యేందుకు దిల్లీకి వచ్చాను. గౌరవనీయులైన సీఎంతో పాటు సాయంత్రం ఆయన దిల్లీ నివాసంలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశానికి కూడా హాజరయ్యానని వివరించారు. 'నా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి, గత 37 సంవత్సరాలుగా మా సంబంధాన్ని ప్రశ్నార్థకం' చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'వాస్తవమేమిటంటే, నేను నా స్వంత లోక్‌సభ నియోజకవర్గంలో నా వ్యక్తిగత కారణంగానే నా రాజీనామాను సమర్పించాను' అని ముంగేర్ ఎంపీ పేర్కొన్నారు. 'నితీశ్ కుమార్ నాయకత్వంలో జేడీ(యూ) పటిష్ఠంగా ఉంది' అని ఆయన నొక్కి చెప్పారు. జేడీ(యూ) జాతీయ కార్యవర్గం, జాతీయ మండలి సమావేశాలను నుంచి తిరిగి వచ్చిన తర్వాత, 'నేను అటువంటి అన్ని మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు పంపుతాను. వాటిపై పరువు నష్టం దావాలు వేస్తాను' అని పేర్కొన్నారు.

విశాలాంధ్ర
ఆదివారం
31 డిసెంబరు 2023

కొత్త పార్లమెంటు భవనం

చరిత్రాత్మక పాత పార్లమెంటు భవనంపై మొహంమొత్తిన మోదీ ప్రభుత్వం సెంట్రల్ విస్టా రీడవలప్‌మెంటులో భాగంగా నూతన పార్లమెంటు భవనాన్ని నిర్మించి, మే 28వ తేదీన ప్రారంభించింది. సమాధి ఆకారంలో కట్టిన ఈ భవన నిర్మాణంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం సమాధి అయిందని చెప్పడానికి ఇదొక నమూనా అని వ్యాఖ్యలు విన్పించాయి. 862 కోట్ల రూపాయలతో 1,272 మంది సభ్యులు కూర్చునేలా ఈ భవనాన్ని నిర్మించారు.

పార్లమెంటులోకి ఆగంతకులు

పార్లమెంటులోకి ఆగంతకుల చొరబాటు కలకలం రేపింది. ఇద్దరు ఆగంతకులు డిసెంబరు 13వ తేదీన పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకి పసుపు రంగులో ఉన్న పొగను విరజిమ్ముతూ ఎంపీలను భయాందోళనకు గురిచేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ పార్లమెంటును అట్టుడికించారు. సభ వాయిదా పడింది. పార్లమెంటు వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులను భద్రతాసిబ్బంది అదుపులోకి తీసుకుంది. పార్లమెంటు భవన భద్రతాలోపం బయటపడింది. అలాగే, నిరుద్యోగులైన ఆ నలుగురు ఆగంతకులు దేశంలో విశృంఖలంగా పెరిగిపోయిన నిరుద్యోగానికి ప్రతినిధులుగా మోదీ ప్రభుత్వంపై తమ నిరసన తెలియజేశారు.

ఏమున్నది గర్వకారణం?

\- ఎ.బి.కూన

నిరసన, అసమ్మతి, అసహనం, అరాచకం, ఆందోళన, అవినీతి, అన్యాయాలు, అక్రమాలు, ఆకలికేకలు, అప్పులు, అభివృద్ధిపై అబద్ధాలు... ఇవి తప్ప గడిచిన 2023వ సంవత్సరంలో భారతదేశంలో చెప్పుకోవడానికి ఏమున్నది గర్వకారణం? ఆరంభంలోనే రెజ్లర్ల ఆందోళన, పార్లమెంటులోకి ఆగంతకుల చొరబాటు, మణిపూర్ అల్లర్లు, 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర, ఇండియా కూటమి ఆవిర్భావం, జీ20 భేటీ హడావిడి, 2000 నోటు ఉపసంహరణ, కొత్త పార్లమెంటు భవనం, జనాభాలో అగ్రస్థానానికి భారత్ చేరిక, ఒడిశా రైలు ప్రమాదం, కనీవినీ ఎరుగని ఎండలు, రికార్డుస్థాయిలో స్టాక్‌మార్కెట్లు, వివాదాస్పద నేరచట్టాలు, ఎన్నికల బిల్లులకు ఆమోదం, గవర్నర్ల ఓవరాక్షన్, ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుపై లొల్లి, మహిళా రిజర్వేషన్ బిల్లు, చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 ప్రయోగం, అదానీ కుంభకోణం, పార్లమెంటులో సస్పెన్షన్లతో అప్రజాస్వామిక చరిత్ర సృష్టించిన మోదీ, క్రికెట్, హాకీ వరల్డ్‌కప్‌లలో పరాజయాలు...ఇవీ ప్రధానంగా 2023లో జరిగిన సంఘటనల సమాహారం.

రెజ్లర్ల ఆందోళన

సంవత్సర ఆరంభంలోనే కుస్తీయోధులు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడుగా ఉన్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అనే కామాంధుడు మహిళా కుస్తీవీరులను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ రెజ్లర్లు రోడ్డెక్కారు. అతను రాజీనామా చేయాలని పట్టుబట్టారు. జనవరి 18న ప్రారంభమైన ఈ ఆందోళన 10 నెలల, 2 వారాల, 4 రోజులపాటు కొనసాగింది. ఈ ఆందోళనను తొక్కేయడానికి మోదీ ప్రభుత్వం విశ్వప్రయత్నం చేసి విఫలమైంది. ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య సైతం భారత సమాఖ్యను రద్దుచేసింది. దీంతో డబ్ల్యుఎఫ్ఐకి కొత్తగా ఎన్నికలు జరుపుతామని హామీయిచ్చినప్పటికీ, ఎన్నికల సమయానికి మళ్లీ తొండాట ఆడింది. డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ అనుచరుడికే డబ్ల్యుఎఫ్ఐ పగ్గాలు దక్కేలా కుట్రపన్నింది. దీనికి నిరసనగా ప్రముఖ రెజ్లర్ సాక్షిమాలిక్ తన బూట్లను టేబుల్‌పై పెట్టి కన్నీళ్ల పర్యంతమై ఆటకు గుడ్‌బై చెప్పారు. బజరంగ్ పునియా, వినేశ్ ఫొగట్ తమ పద్మశ్రీ పురస్కారాలను వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించారు. కొంతమంది బాక్సర్లు సైతం అసంతృప్తి వ్యక్తంచేశారు. చివరకు దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం డబ్ల్యుఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని రద్దు చేసింది. ఏదైతేనేం, మోదీ విధానాలను ఈ నిరసన ఎత్తిచూపింది.

గవర్నర్ల అతిచేష్టలు

బిజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న కేరళ, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల విచ్ఛిన్నకర పాత్ర వివాదాస్పదమైంది. విధాన నిర్ణయాల అమలుకు గవర్నర్లు అడ్డంకిగా మారుతున్నారని సుప్రీంకోర్టు సైతం మొట్టికాయలు వేసినా, రాజ్యాంగ విరుద్ధంగా, పాకెట్ వీటో అధికారంతో అప్రజాస్వామిక చర్యలకు పాల్పడి, మోదీ సర్కారుకు తొత్తులుగా మారారు. గవర్నర్ల అతిచేష్టలు మోదీ పాలనను భ్రష్టుపట్టించాయి.

మణిపూర్‌లో హింసాకాండ

మణిపూర్ రాష్ట్రంలో రెండు గిరిజన తెగల మధ్య జరిగిన ఘర్షణలు అతిపెద్ద హింసాకాండకు దారితీసింది. ఈ ఘర్షణల్లో వందలాది మంది పౌరులు మరణించారు. సైన్యం రంగంలోకి దిగి ఇంకొంతమంది పౌరులను చంపేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, వీడియోలు తీసి, వైరల్ చేయడం లాంటి ఘటనలు పునరావృత్తం కావడంతో మణిపూర్ ఘర్షణలు దాదాపు ఆరు మాసాలపాటు కొనసాగుతూనే ఉన్నాయి. హరియాణాలోని నూహ్ జిల్లాలో అల్లర్లు కూడా వార్తల్లో నిలిచాయి. జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు యథాప్రకారం కొనసాగాయి.

సస్పెన్షన్ల పర్వం

పార్లమెంటు భద్రతా లోపంపై అమిత్‌షా తక్షణమే సమాధానం చెప్పాలని ప్రతిపక్ష ఎంపీలు నినదించారు. దీంతో రాక్షస బిల్లులను ఏకపక్షంగా ఆమోదింప జేసుకునేందుకు డిసెంబరు 19వ తేదీన 49 మంది ఎంపీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో రెండు మూడు రోజులూ ఈ సస్పెన్షన్లు కొనసాగాయి. చివరకు సస్పెన్షన్ల సంఖ్య 143కి పెరిగింది. భారతదేశ పార్లమెంటు చరిత్రలోనే తొలిసారిగా ఇంత పెద్దసంఖ్యలో సభ్యులను సస్పెండ్ చేసి, మోదీ సర్కారు అపకీర్తిని మూటగట్టుకున్నది. మోదీ ఫాసిస్టు, అప్రజాస్వామిక చర్యలకు ఈ ఉదంతం నిదర్శనం. ఒక్క లోక్‌సభ నుంచే 97 మంది సస్పెండ్ కావడం విచారకరం. ఈ సస్పెన్షన్ల పర్వంపై అంతర్జాతీయ మీడియా సైతం ధ్వజమెత్తింది. అందర్నీ సస్పెండ్ చేసిన తర్వాత నేర చట్టాలతోసహా వివిధ బిల్లులపై ఆమోదముద్ర పడింది.

నేరచట్టాలకు ఆమోదం

పౌరహక్కులను కాలరాసే వినాశకర బిల్లులకు ప్రతిపక్ష రహిత పార్లమెంటులో మూజువాణి ఓటుతో మోదీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), సాక్ష్యాధారాల చట్టం (ఎవిడెన్స్ యాక్ట్) స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లులను చట్టాలుగా మార్చుకుంది. రాజద్రోహ చట్టాన్ని దేశద్రోహ చట్టంగా మార్చి, మరింత కఠినతరం చేసింది. పోలీసులకు అపరిమితమైన అధికారాలు కల్పించింది. మోదీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలు ఈ చట్టాలతో విశ్వరూపం దాల్చాయి. హక్కుల కోసం ఏ మాత్రం గళమెత్తినా కటకటాల పాలవ్వాల్సిందే. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఈ చట్టాలతో అణచివేశారు. కొత్తగా 20 నేరాలను చేర్చడం, పాతచట్టంలోని 19 నిబంధనలను తొలగించడం, 33 నేరాల్లో జైలు శిక్ష పెంచడం, 83 నేరాల్లో జరిమానా పెంచడం, 23 నేరాల్లో కనీస శిక్షను తప్పనిసరి చేయడం, అత్యాచారం సెక్షన్లు 375, 376లను 63గా మార్చడం, హత్య సెక్షన్ 302ను 101గా మార్చడం, కిడ్నాప్ సెక్షన్ 359ని 136గా మార్చడం వంటి అంశాలు ఈ చట్టాల్లో ఉన్నాయి. వీటితోపాటు ఎన్నికల బిల్లులకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సీఈసీ, ఈసీలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చేలా చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీశారు. ఇది కూడా రాజ్యాంగ విరుద్ధమే. ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లు కూడా విమర్శలు ఎదుర్కొన్నది. దేశ రాజధానిలో అధికారుల బదిలీల, నియామకాల అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కట్టబెడుతూ ఆమోదించిన ఈ బిల్లుకు సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు కొత్త ఆదాయపన్ను చట్టాన్ని మోదీ సర్కారు ఆమోదించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు మాత్రం చరిత్రాత్మకమైనది. నారీశక్తి వందన్ అధినియమ్ పేరుతో చట్టాన్ని చేసి, చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్‌కు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు..జోడోయాత్ర

మార్చి 23-24 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసులో పార్లమెంటు సభ్యునిగా అనర్హత వేటు వేస్తూ మోదీ ప్రభుత్వం స్పీకర్ ద్వారా నిర్ణయాన్ని ప్రకటించింది. రెండేళ్ల జైలుశిక్ష కూడా పడింది. అయితే ఆగస్టు 7న సుప్రీంకోర్టు ఆయన శిక్షపై స్టే విధించి, లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది. అంతకుముందు రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 2022 సెప్టెంబరు 7న కన్యాకుమారిలో ప్రారంభించిన 'భారత్ జోడోయాత్ర' జనవరి 19న కశ్మీర్‌లో ముగిసింది. 12 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో 3570 కిలోమీటర్ల పొడవునా ఈ యాత్ర సాగింది. తాజాగా మణిపూర్ నుంచి ముంబైకి భారత్ న్యాయ్ యాత్ర పేరుతో కొత్త యాత్రను చేపట్టాలని రాహుల్ నిర్ణయించారు. జోడోయాత్ర 2.0గా దీన్ని పిలుస్తున్నారు.

జీ 20 హడావుడి

ప్రతియేటా జీ 20 శిఖరాగ్ర సదస్సు ఏదో ఒక దేశంలో జరుగుతూనే వుంటుంది. 20 సభ్య దేశాల్లో సంవత్సరానికి ఒక దేశం ఈ సదస్సుకు ఆతిథ్యమిస్తుంది. ఇది సర్వసాధారణ విషయం. కానీ మోదీ ప్రభుత్వం దీన్ని ఒలింపిక్ క్రీడలను మించిన గొప్ప ఈవెంట్‌లా భావించి, అత్యుత్సాహం ప్రదర్శించింది. ఎప్పటిలాగానే పెట్టుబడిదారులకు అనుకూలమైన నాలుగు పనికిమాలిన తీర్మానాలతో ముగిసిన జీ20 శిఖరాగ్ర సదస్సును మోదీ ఇష్టానుసారం తన వ్యక్తిగత ప్రచారానికి వాడుకొని కోట్లాది రూపాయలు బుగ్గిపాలు చేశారు. ఈ సదస్సు నిర్వహణ వల్ల ఒనగూరిన ప్రయోజనం కన్నా దేశానికి జరిగిన ఆర్థిక నష్టమే ఎక్కువ. సెప్టెంబరు 9-10 తేదీల్లో జరిగిన ఈ సదస్సు నిర్వహణకు 2022-23 బడ్జెట్‌లో రూ.320 కోట్లు, 2023-24లో రూ.990 కోట్లను కేటాయించారు. అంతకన్నా ఎక్కువే ఖర్చయింది. బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు మోదీ కాలికింద పనిచేసే ఏపీ, తెలంగాణ (ఎన్నికలకు ముందు) వంటి రాష్ట్రాలకూ కొన్ని ఉపభేటీల నిర్వహణకు అవకాశమిచ్చి, ప్రోటోకాల్స్, ఆతిథ్యాలు పేరుతో కోట్లాది రూపాయలను ఖర్చుచేశారు. ఈ జీ20లో 19 దేశాలతోపాటు యూరోపియన్ యూనియన్ (ఈయూ) సభ్యదేశాలుగా వున్నాయి. ప్రపంచ జీడీపీ 80%, ప్రపంచ వాణిజ్యం 75%, ప్రపంచ జనాభా 60% ఆక్రమించిన దేశాలకు ఇందులో ప్రాతినిధ్యం వుంటుంది. జనాభా విషయంలో భారత్ ముందుండి, ఈ కూటమిలో స్థానం సంపాదించింది. మోదీ పోస్టర్లు, బ్యానర్లు, ఇతర అంశాల ప్రచారానికే డబ్బును కుమ్మరించారు.

9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు

2023లో 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఓట్లు కొనేందుకు నోట్లు ఏరులైపారాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల్లో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసింది. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై విపరీతమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. మార్చి2న వెల్లడైన మూడు రాష్ట్రాల ఫలితాల్లో త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ అధికార పీఠాన్ని నిలుపుకోగా, మేఘాలయలో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. మేఘాలయలో ఎన్‌పీపీ సంకీర్ణ ప్రభుత్వంలోనూ బీజేపీ చొరబడింది. మే 10-13 తేదీల్లో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పాలక బీజేపీకి ఘోర పరాజయం ఎదురైంది. కాంగ్రెస్ పార్టీ 224 సీట్లకు గాను 135 స్థానాలు హస్తగతం చేసుకుంది. సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా, డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత నవంబరు, డిసెంబరు మాసాల్లో మరో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. సెమీఫైనల్స్‌గా వీటిని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్ఎస్ అనూహ్యంగా పరాజయం పాలైంది. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించి, రెండోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఉమ్మడిరాష్ట్రంలో తొలిసారి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో బీజేపీ గెలిచింది. 'ఇండియా' కూటమిని విస్మరించి, మిత్రపక్షాల సహకారం లేకుండా కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేసి ఓడిపోయింది. మిజోరంలో జొరం పీపుల్స్ మూవ్‌మెంట్ అధికారం కైవసం చేసుకుంది.

'ఇండియా' ఆవిర్భావం

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏకు ప్రత్యామ్నాయంగా 'ఇండియా' కూటమి ఆవిర్భవించింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలోని పక్షాలు కలిసి పోటీచేస్తాయి. 'ఇండియన్ నేషనల్ డెమొక్రటిక్ ఇంక్లూజివ్ అలయెన్స్ (ఇండియా)' తాజాగా సీట్ల సర్దుబాటుపై సమావేశం కావాలని నిర్ణయించింది. ఈ కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు, జేడీ(యు), టీఎంసీ, ఆప్ తదితర పక్షాలు భాగస్వాములుగా ఉన్నాయి. బీజేపీని ఓడించడమే ఈ కూటమి ప్రధాన లక్ష్యం. వివిధ అంశాలపై దాదాపుగా ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. మల్లిఖార్జున ఖర్గేను ప్రధాని అభ్యర్థిగా చేయాలని మమతా బెనర్జీ చేసిన ప్రతిపాదనకు దాదాపు మద్దతు లభించింది.

ఇంకొన్ని విశేషాలు...

జనాభాలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది. జనవరి 1 నాటికి 8 బిలియన్లకు చేరుకుంటున్న భారతీయ జనాభా 2023 మధ్యలోనే చైనాను రెండోస్థానానికి నెట్టేసి మొదటి స్థానానికి చేరుకుంది. జూన్ 2న ఒడిశా రైలు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. బాలాసోర్ జిల్లాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఒక గూడ్స్ రైలును ఢీకొనడంతో 280 మందికిపైగా మరణించారు. 900 మందికిపైగా గాయపడ్డారు. ఉత్తరాదితోపాటు ఈశాన్య రాష్ట్రాలను ముంచెత్తిన వరదల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నవంబరులో ఉత్తరాఖండ్ సొరంగంలో చిక్కుకున్న 21 మంది భవన నిర్మాణ కార్మికులను కాపాడిన ఉదంతం దాదాపు 10 రోజులు ఉత్కంఠను కలిగించింది. లిక్కర్ కేసులో ఢిల్లీ మంత్రులు మనీష్ సిసోడియా, సత్యేంద్రజైన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. కేసీఆర్ కుమార్తె కవిత కూడా ఈ కేసుల్లో ఇరుక్కున్నారు. ఖలిస్థాన్ వేర్పాటువాది అమృత్‌పాల్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌లో తలెత్తిన వారిస్ పంజాబ్‌దే ఉద్యమాన్ని పోలీసులు అణచివేశారు. ఆ తర్వాత అతన్ని అరెస్టు చేశారు. ఈ ఏడాది అనూహ్యంగా ఎండలు మండాయి. వందలాది మంది వడదెబ్బకు గురై మరణించారు. అకాలవర్షాలు కూడా నష్టాన్ని కలిగించాయి. శాస్త్రసాంకేతిక రంగాల్లో కొంత పురోగతి లభించింది. చంద్రయాన్-3ని ఇస్రో విజయవంతంగా ముగించింది. అలాగే సూర్యునిపై పరిశోధనల నిమిత్తం ఆదిత్య-ఎల్1ను దిగ్విజయంగా పరీక్షించింది.

అదానీ కుంభకోణం

హవాలా కుంభకోణాన్ని తలపించేలా అదానీ గ్రూప్ దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల మేరకు మార్కెట్‌కు టోపీ పెట్టిన ఉదంతం కలకలం రేపింది. మోదీకి అత్యంత సన్నిహితుడు, ప్రియాతిప్రియమైన మిత్రుడు అదానీకి చెందిన సంస్థలు స్టాక్ మార్కెట్‌ను దగాచేసి, దొంగఖాతాలు, లెక్కలతో మోసాలు, అవకతవకలకు పాల్పడి, ఏకంగా మార్కెట్‌కు 10,00,000 కోట్లకు పైగా నష్టం కలిగించినట్లు ఆండర్సన్ సారథ్యంలోని అమెరికా హిండెన్‌బర్గ్ రీసెర్చ్ విడుదల చేసిన ఒక కథనం సంచలనం సృష్టించింది. అదానీ స్టాక్స్ కుప్పకూలిపోయాయి. అంతర్జాతీయంగా మోదీ పరువు ముక్కలైంది. అయినప్పటికీ, మోదీ ప్రభుత్వంతోపాటు ఏపీ వంటి కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు తమ స్వప్రయోజనాల కోసం అదానీకి ఆస్తులను విక్రయిస్తూనే ఉన్నారు. లేని ఆస్తులను చూపించి, 'గాలి' లెక్కలతో అదానీ జనాన్ని మోసం చేశారన్నది ఈ కుంభకోణం సారాంశం.

ఆర్థిక వ్యవస్థ కుదేలు

2023లో ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒడిదుడుకులు ఎదుర్కొన్నది. కాకపోతే స్టాక్‌మార్కెట్ భారీగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. డిసెంబరు 15న 21,457 నిఫ్టీ పాయింట్లను తాకింది. 4 ట్రిలియన్ల మార్కెట్ చేరుకుంది. అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాత ఐదోస్థానంలో భారత్ నిలిచింది. అలాగే 2000 నోటును ఆర్‌బీఐ ఉపసంహరించుకుంది. ఈ నోట్లను మార్చుకునేందుకు గడువిచ్చింది. 97.20% నోట్లు వెనక్కి వచ్చినట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే ఇప్పటికీ దీనిపై స్పష్టమైన ప్రకటన లేనందున ఈ నోటు చెల్లుబాటుపై చర్చ జరుగుతూనే ఉంది.

మమతా బెనర్జీకి వైద్య పరీక్షలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రిలో శనివారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో ఆమె ఎడమ మోకాలికి, కుడి భుజానికి గాయాలయ్యాయి. రొటీన్ చెకప్‌లో భాగంగానే తాను ఆసుపత్రికి వచ్చానని, వైద్యులు పూర్తిగా చెక్ చేశారని మమతా బెనర్జీ తెలిపారు. కుడి భుజానికి మైనర్ సర్జరీ జరిగిందా అని మీడియా అడగగా...అదేమంత తీవ్రమైనది కాదని, ఆందోళన పడవద్దని మమత చెప్పారు. సిలిగురి వద్ద ఐఏఎఫ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ సమయంలో సమస్య తలెత్తిందని, రెండు కాళ్లు, భుజానికి గాయాలయ్యాయన్నారు. ఈరోజు పూర్తిగా వైద్యపరీక్షలు జరిపారని, ఇబ్బందేమీ లేదదని, మామూలుగానే నడుస్తున్నానన్నారు. ఆసుపత్రిలో మూడు గంటల సేపు వైద్యపరీక్షల అనంతరం మమతా బెనర్జీ తిరిగి బయలుదేరుతూ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

లఖ్‌బీర్ సింగ్ ఉగ్రవాది

కేంద్ర హోంశాఖ ప్రకటన

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు, తీవ్రవాద కార్యకలాపాలను అడ్డుకునేందుకు అనేక చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం...తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. కెనడాలో ఆశ్రయం పొందుతున్న గ్యాంగ్‌స్టర్ లఖ్‌బీర్ సింగ్ లండాను ఉగ్రవాదిగా ప్రకటించింది. ఉగ్రదాడులు, దోపిడీలు, హత్యల్లో అతడి ప్రమేయం ఉన్నందున ఉపా చట్టం కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 33 ఏళ్ల లఖ్‌బీర్ సింగ్ స్వస్థలం పంజాబ్‌లోని తరన్ తరన్ జిల్లా. 2022లో మొహాలీలోని పోలీసు ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌పై జరిగిన రాకెట్ ఆధారిత గ్రనేడ్ దాడికి ఇతడే కుట్రదారి. దీంతో పాటు శక్తిమంతమైన ఐఈడీల సరఫరా, అధునాతన ఆయుధాలు, పేలుడు పదార్థాల స్మగ్లింగ్ వంటి కార్యకలాపాల్లో ఇతడు చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు హోంశాఖ తెలిపింది.

అనేక ఉగ్రదాడులు, దోపిడీలు, హత్యలు, ఐఈడీలు అమర్చడం, ఆయుధాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతో పాటు పంజాబ్, దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉగ్రవాద చర్యలకు నిధులు సమకూర్చడం వంటి ఘటనలకు సంబంధించి లఖ్‌బీర్‌పై చాలాక్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించింది. 2017లోనే లఖ్‌బీర్ దేశం విడిచి కెనడా పారిపోయినట్లు హోంశాఖ తమ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఇతడు ఖలిస్థానీ గ్రూప్ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ సభ్యుడిగా ఉన్నట్లు తెలిపింది. అంతేగాక ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్, గురుపత్వంత్ సింగ్ పన్నూతో ఇతడికి సన్నిహిత సంబంధాలున్నట్లు వెల్లడించింది.

సంపాదకీయం

చిగురిస్తున్న కొత్త ఆశలు

జన జీవితాలు మారకపోయినా క్యాలెండర్‌లో కాగితాలు తిరుగుతూనే ఉంటాయి. రోజులు, వారాలు, నెలలు గడిచిపోతూనే ఉంటాయి. అలా మరో సంవత్సరం మారిపోయింది. ఓ మనిషి జీవిత కాలంలో ఒక సంవత్సరం మహత్తరమైంది ఏమీ కాదు. మంచో, చెడో అనేక సంఘటనలు జరిగి ఉండొచ్చు. మంచిని గుర్తుంచుకోవడం కష్టమే కావచ్చు. కానీ చెడు చారలు అంత సులభంగా మాసిపోవు. 2023 సాంకేతిక, వినూత్న ఆవిష్కరణల, సాంస్కృతిక, మౌలిక సదుపాయాల కల్పనారంగంలో విశిష్టమైన మార్పులు తీసుకొచ్చి ఉండొచ్చు. అలాగే దుష్కార్యాలవల్ల మానని గాయాలురేగి ఉండొచ్చు. అవి జీవితాంతం మానకుండా చారలుగా మిగిలిపోయి ఉండొచ్చు. ఈ దశాబ్దంలోకెల్లా ఈ సంవత్సరంలో క్యాలెండర్ గిర్రున తిరిగినట్టు అనిపిస్తోంది. ఈ సంవత్సరం ముగిసిన నాలుగు నెలలకే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి కనక గత తొమ్మిదేళ్ల ఎనిమిది నెలల పాలన తెచ్చిపెట్టిన విభజన, విద్వేష రాజకీయాలు త్వరలో ముగిసిపోతాయన్న ఆశావాదంతో ఉన్న వారికి ఈ ఏడాది తొందరగా ముగిస్తే బావుండుననిపించవచ్చు. నూతన సంవత్సరం వల్ల మన జీవితం అమాంతం మారిపోక పోయినా ఆ తలంపే కొత్త ఆశలను చిగురింప చేస్తుంది. 2024లో మన దేశంలో సార్వత్రిక ఎన్నికలే కాకుండా అమెరికా, రష్యా, బంగ్లా దేశాల అధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోనూ ఎన్నికలు జరగాల్సి ఉంది. మన దేశంలో ఏడు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికలలో బీజేపీ అనూహ్యంగా ఘన విజయం సాధించడం ప్రతిపక్షాలు, మెరుగైన పాలనకోసం ఎదురుచూస్తున్న పౌరులకు కొంత నిరాశ కలిగి ఉండొచ్చు. 2023వ సంవత్సరం ఆసాంతం నిరాశ కలిగించలేదు. అనేక విజయాలు సాధించాం. చంద్రయాన్ ప్రయోగం ద్వారా ఖగోళ శాస్త్ర పరిశోధనల్లో గణనీయమైన మైలురాయి అధిగమించాం. స్టాక్ మార్కెట్లు మునుపెన్నడూ లేని సరికొత్త రికార్డులు సృష్టించాయి. అయితే స్టాక్ మార్కెట్ సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థకు సూచీలుగా పరిగణించే వారికి కొదవలేకపోయినా సామాన్యుల ఆర్థిక పరిస్థితికి ఆ ఎదుగుదల ఎంత మాత్రం కొలమానం కాదు. జీ20 సమావేశాలు దిగ్విజయంగా పూర్తి అయినాయి. ఇది ప్రతి ఏడాదీ జరిగేదే అయినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి విజయాన్నీ తన ఖాతాలో వేసుకుని అది తన వ్యక్తిగత విజయం అనుకుంటారు. సినిమా రంగం ఆస్కార్ అవార్డు సంపాదించడం ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణమే. అంతర్జాతీయంగా చూస్తే జనం గుండెల మీద టిక్ టిక్ అనే అణు కేంద్రాలను సంపూర్ణంగా మూసివేయాలని ఏడాది ముగుస్తున్న సమయంలోనే జర్మనీ నిర్ణయించడం మానవాళికే ఆనందదాయకం. అదే సమయంలో 2022లో ప్రారంభమైన రష్యా-ఉక్రేన్ యుద్ధం ఇంకా కొనసాగుతుండడం, ఇజ్రాయిల్ మీద పలస్తీనియన్ పోరాటయోధుల సంస్థ హమాస్ మెరుపు దాడి చేసి అపారమైన నష్టం కలిగించడం శాంతి చెదరడానికి సంకేతం. కానీ తమ మీద జరిగిన దాడికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణ హోమం మానవాళి మీదే ప్రకటించిన యుద్ధం. టర్కీ సిరియా, నేపాల్‌లో భయానక భూకంపాలు, అమెరికాలో విచ్చలవిడి కాల్పుల సంఘటనలు, పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు జైలు శిక్ష విధించడం, మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రవాస జీవితం చాలించి స్వదేశం తిరిగి రావడం 2023లోనే జరిగాయి. 2023 ఆరంభంలోనే భూకంపంవల్ల టర్కీలో 59,000 మంది మరణిస్తే సిరియాలో ఎనిమిది వేల మంది సజీవ సమాధి అయ్యారు. ఇదే సంవత్సరం మన దేశ జనాభా చైనా జనాభాను అధిగమించింది. అదే సమయంలో పెరుగుతున్న మానవ వనరులను సద్వినియోగం చేసుకునే మార్గం ఏమిటి అన్న ప్రశ్న కూడా వేధిస్తోంది. ఇజ్రాయిల్ పలస్తీనియన్ల మీద కొనసాగిస్తున్న కిరాతక దాడిలో ఇప్పటికే ఇరవై వేల మంది పలస్తీనియన్లు మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. గాజాలో 20 లక్షలకు పైగా జనం ఉంటే అందులో 90 శాతం మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలస పోవలసి వచ్చింది. ఖలిస్తానీ తీవ్రవాది అనుకుంటున్న నిజ్జర్ హత్య కెనడాతో మన సంబంధాలు బెడిసికొట్టేలా చేసింది. అలాగే పనూన్ విషయంలో అమెరికాతో వైషమ్యాలకు దారి తీసింది. జాతీయ అంతర్జాతీయ పతకాలు సాధించిన మహిళా మల్లయోధులు ఈ ఏడాది ఆరంభంలో దిల్లీలో రోడ్డెక్కి నిరసన చేస్తే వారి ఇబ్బందులు ఇప్పటికీ తీరనే లేదు. ఇటీవల జరిగిన భారత కుస్తీ సమాఖ్య ఎన్నికలలో మల్ల యోధులపై అఘాయిత్యం చేసిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సహచరుడు సంజయ్ సింగ్ గెలిచారు. దీనికి నిరసనగా సాక్షీ మాలిక్ తాను ఇక పోటీలలో పాల్గొనబోనని ప్రకటించాల్సి వచ్చింది. జడుసుకున్న మోదీ ప్రభుత్వం కంటి తుడుపుగా ఆ ఎన్నికలను రద్దు చేసింది. మల్లయోధుల పోరాటానికి సంయుక్త కిసాన్ మోర్చా రైతులు సహా సానుభూతి తెలియజేయడం ప్రజోద్యమాల విస్తృతికి నిదర్శనం. మోదీ హయాంలో విద్వేష రాజకీయాలు ఈ ఏడాది కూడా యథావిధిగా కొనసాగాయి. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోదీ నాయకత్వంలోని బీజేపీ అయోధ్యలో రామమందిర ఆవిష్కరణ సందర్భంగా మళ్లీ ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. అయోధ్య ఉద్యమానికి మూలకారకులైన లాల్‌కృష్ణ అద్వాణీ, మురళీ మనోహర్ జోషీకి ప్రారంభోత్సవ ఆహ్వానాలు అందించి వెంటనే మీరు హాజరు కాకూడదని ఆంక్ష విధించింది. మరో వేపు 27 ప్రతిపక్షాలు కలిసి "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటు చేసినా ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ సీట్ల పంపకంలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ ఐక్య సంఘటన సంపూర్ణంగా ఐక్యమైతే తప్ప బీజేపీతో ముఖాముఖి పోటీకి అవకాశం ఉండదు. అంటే మోదీని గద్దెదించాలన్న లక్ష్యం నెరవేరదు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మోదీ బలపడుతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. "ఇండియా" ఐక్య సంఘటనలోని బెంగాల్ ముఖ్యమంత్రి ఈ సంఘటన అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని అవుతారని ఏకపక్షంగా ప్రకటించి ఒక దెబ్బతో రెండు పిట్టలను కొట్టే ప్రయత్నం చేశారు. ఇంకో వేపు మోదీ హయాంలో పార్లమెంటు ఎందుకూ కొరగాకుండా పోతోంది. మోదీ ప్రతిపక్షాలు లేని పార్లమెంటును కోరుకుంటున్నారని దాదాపు 150 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి దుష్ట చరిత్ర సృష్టించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద విఘాతం. నూతన సంవత్సరం మీద ప్రజలకు అనేక ఆకాంక్షలు ఉంటాయి. జన జీవితాలను ప్రభావితం చేసేవి రాజకీయాలే. అందువల్ల మోదీని గద్దె దించితే తప్ప దేశ పరిస్థితి మెరుగు పడే అవకాశం ఉండదు. ప్రతిపక్షాలకు లక్ష్య శుద్ధి ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు.

తమిళ రాజకీయంలో 'కెప్టెన్' ముద్ర

తీర్థంకర్ మిత్ర

ప్రముఖ తమిళ నటుడు, డీఎండీకే పార్టీ అధినేత విజయ్‌కాంత్ తమిళ చలనచిత్ర రంగంలో, రాజకీయ రంగంలో "కెప్టెన్"గా తనదైన ముద్ర వేశారు. సినీ నటుడుగానే కాకుండా, 2005లో దేశీయ ముర్పక్కు ద్రవిడ కజగం(డీఎండీకే) పేరిట రాజకీయ పార్టీని స్థాపించి రాజకీయాల్లోనూ ఆయన రాణించారు. అశేష అభిమానుల ఆదరాభిమానాన్ని చూరగొన్నారు. 1952 ఆగస్టు 25న నారాయణ్ విజయరాజ్ అల్గర్‌స్వామిగా జన్మించిన విజయ్‌కాంత్ సంప్రదాయక తమిళ కులాలకు చెందినవారు కాదు. 1979లో సినిమారంగ ప్రవేశంచేసిన విజయ్‌కాంత్ 1991లో నటించిన 100వ చిత్రం "కెప్టెన్ ప్రభాకరన్' విడుదలైనప్పటి నుంచి ఆయనకు 'కెప్టెన్' అనే పేరొచ్చింది. ఆయనను 'పురట్చి కలైగర్' అని కూడా పిలుస్తారు, దీని అర్థం 'విప్లవ కళాకారుడు'. విజయ్‌కాంత్ ఎంజీఆర్‌ను ఆరాధ్యదైవంగా కొలిచేవారు. కింగ్ మేకర్ అయిన వ్యక్తి ఎప్పటికీ రాజు కాలేడన్నది విజయ్‌కాంత్ విషయంలో సత్యం. నాయకుడిగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ విజయం ఆయనను వెతుక్కుంటూ రాలేదు. 1979లో ఆయన నటించిన 'ఇనికింఇలమై' తర్వాత వరుసగా ఫ్లాప్‌ల పరంపర కొనసాగింది. ఆయినా ఎప్పుడూ నిరుత్సాహపడలేదు. ఓటమితో పోరాడుతూనే ఉన్నారు. పల్లెటూళ్లలో ఈ సినిమా ఏడాదిపాటు ఆడినప్పటికీ పట్టణ ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోయింది. తదనంతర పరిస్థితులు విజయ్‌కాంత్‌కు అనుకూలంగా మారాయి. అభిమానుల ప్రోద్బలంతో 'డీఎండీకే' పార్టీని స్థాపించినప్పటికీ రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూశారు. ఎన్నికల్లో విజయం, అపజయాలను చాకచక్యంగా ఎదుర్కొనే రాజకీయ చతురత లేకపోవడంతో, అభిమానుల ఓటు బ్యాంకు విజయ్‌కాంత్‌ను నిరాశపరిచింది. 1980వ దశకంలో ఆ తర్వాత కాలంలో విజయ్‌కాంత్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అత్యంత ఆదరణ లభించింది. ఇది ఆయన ఆర్థిక ఎదుగుదలకు ఊతమిచ్చింది. అయితే రాజకీయాల్లో మాత్రం ఆయన ఊహించినంతగా జనం ఆదరించలేకపోయారు. విజయ్‌కాంత్ డీఎండీకే పార్టీ స్థాపించిన దశాబ్ది కాలంలోనే తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. సినీరంగంలో మాత్రం నూతన శిఖరాలకు చేరుకున్నారు. సినీరంగంలో నిచ్చెన దిగువ నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించవలసివచ్చింది. సినిమాల్లో పోషించిన వివిధ పాత్రలు విజయ్‌కాంత్‌కు ఈ పరిమితులను అధిగమించడంలో సహాయపడ్డాయి. రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించలేని అనేకమంది కంటే కులాతీత వ్యక్తి అయిన విజయ్‌కాంత్ తన అభిమానుల వీరాభిమానానికి పాత్రులయ్యారు. విజయ్‌కాంత్ చాలా సినిమాల్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. విజయ్‌కాంత్ నటించిన చిత్రాల ఇతివృత్తాలన్నీ అవినీతికి వ్యతిరేకంగా నిజాయితీ, ధర్మబద్ధంగా ఉండేవి. ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడం ప్రేక్షకుల్లో ఆయనకు మద్దతు, పునాదిని పెంచాయని చెప్పవచ్చు. విజయ్‌కాంత్ అభిమానులు దాదాపు ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున ఉన్నవారే. ఇదే కెప్టెన్ విజయకాంత్ "కరుప్పు ఎంజిఆర్"(నల్ల ఎంజీఆర్)గా మారేందుకు దోహదపడింది.

తమిళనాడులో 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తీవ్రవాదులకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేక పోరాట యోధుడిగా విజయ్‌కాంత్ తెరపైకి వచ్చారు. ఈ ఎన్నికల్లో డీఎండీకె 8.5 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. 2011లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకే రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ అది డీఎంకె, ఏఐడీఎంకెకు ప్రత్యామ్నాయంగా నిలవలేకపోయింది. సినిమా నేపథ్యంలేని రాజకీయ ప్రవేశం ఉన్న ప్రేమలతను విజయ్‌కాంత్ వివాహం చేసుకున్నారు. ఒకానొక దశలో తాను వీల్‌చైర్‌కు పరిమితం కావడంతో సహజంగానే వక్త అయిన ప్రేమలతను డీఎండీకె ప్రధాన కార్యదర్శిగా చేశారు.

కాళేశ్వరంకన్నా కనాకష్టం పోలవరం!

వి. శంకరయ్య

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకున్నా వివిధ విభాగాల పనులు పూర్తిచేసి ఎంతో కొంత మేర నీళ్లు పారించారు. నాణ్యత పక్కన పెడితే మూడు బ్యారేజీల నిర్మాణం జరిగింది. నిర్మించిన పంపు హౌస్‌లు పని చేశాయి. కాని పోలవరం ప్రాజెక్టు కాళేశ్వరం కన్నా కనాకష్టంగా మిగిలి పోయింది. నిర్మాణం పూర్తి కాక ముందే లొసుగులు బయటపడ్డాయి. పైగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించే జాతీయ ప్రాజెక్టు. ప్రాజెక్టు నిర్మాణంలో ఏ విభాగమూ పూర్తి కాలేదు. నీళ్లు పారించడం అటుంచి ఏ ఒక్క విభాగమైనా ఎప్పుడు పూర్తి అవుతుందో చెప్పలేమని సాక్షాత్తు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించడం కొసమెరుపు. 2017-18 షెడ్యూల్ రేట్ల మేరకు తొలి దశ (41.15 మీటర్ల ఎత్తు) పూర్తి చేయడానికి 36, 449.83 కోట్ల రూపాయలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కాని కేంద్ర జల సంఘం 31, 625 కోట్ల రూపాయలకు ఆమోదం తెలిపింది. రాజ్యసభలో కేంద్ర మంత్రి చెప్పిన మేరకు ఒక దఫా 17, 144 కోట్ల రూపాయల కోరిన రాష్ట్ర ప్రభుత్వం తిరిగి 19, 517 కోట్ల రూపాయలకు టెండర్ పెట్టింది. ఏ మొత్తమైనా కేంద్ర ఎప్పుడు ఇస్తుందో తెలియదు. ఈ లోపు ఎన్నికలు తరుము కొస్తున్నాయి.

ఈ నెల మొదటి వారం నుంచి అటు రాష్ట్ర జల వనరుల శాఖ అచేతనంగా వుండి పోయింది. అంతకు ముందే కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసింది. 2019 ఎన్నికల ముందు ఏం జరిగిందో అందరికి తెలుసు. మరీ ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో వివాదాల మధ్య పనులు చేపట్టిన కాంట్రాక్టరు మరింత జాగ్రత్త పడే అవకాశం వుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బీటలు వారి కాంట్రాక్టర్ మెడకు చుట్టుకొన్నట్లు పోలవరం ప్రాజెక్టులో గైడ్‌బండ్ కూలి పోవడం కాంట్రాక్టు సంస్థకు చిక్కులు తెచ్చి పెట్టే అవకాశం వుంది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయి నీళ్లు నిల్వ చేసిన తర్వాత బీటలు వారింది. కాని పోలవరంలో గైడ్ బండ్ నిర్మాణ దశలోనే కూలి పోయింది. ఈ సమస్యలకు మించి గైడ్ బండ్ కూలి పోవడానికి ఎవరు బాధ్యులో తేలిన తరువాతనే ముందుకు వెళతామని అంటే తొలి దశ నిధులు గురించి ఆలోచించుతామని కేంద్ర ప్రభుత్వం

షరతు పెడుతోంది. సరిగ్గా ఎన్నికల ముందు మేడిగడ్డ బీటలు వారి కేసీఆర్ ఓటమికి ఒక అంశమైనట్లే పోలవరంలో కూడా ఎన్నికల ముందు తను ఏరి కోరి తెచ్చుకొన్న కాంట్రాక్టరును దోషిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సిద్ధ పడతారా? ఏతావాతా తేలేదేమంటే ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు కేంద్రం నుంచి చిల్లిగవ్వ రాదు.

తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టుకు మరో చిక్కు ఏర్పడింది. బ్యారేజీల ఎఫ్ఆర్ఎల్ నీటి మట్టం కన్నా తక్కువ ఎత్తులో పంపు హౌస్‌ల నిర్మాణం జరిగిందనే ఆరోపణ వస్తున్నట్లే పోలవరం వివిధ విభాగాల్లో నాణ్యత ప్రమాణాలు లేక పోవడం బయటపడితే ఏమౌతుంది? 2021లోనే డ్యాం డిజైన్ రివ్యూ పానల్ తన తనిఖీల్లో నాణ్యత ప్రమాణాల గురించి నిలదీయడం అప్పట్లోనే మీడియాలో వచ్చాయి. అత్యంత ఎత్తులో నిర్మిస్తున్న స్పిల్ వే గేట్ల అమరికలో గడ్డర్లు బిగించే తీరుపై డిడిఆర్ పి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తర్వాత ఈ అంశంపై వార్తలు రాలేదు. అదేవిధంగా ఎగువ కాపర్ కు వాడే మట్టిలో గట్టితనం లేదని పెద్ద పెద్ద బండ రాళ్లు వేసి కాపర్ డ్యాంపై పగల గొట్టడంపై కూడా డీడీఆర్‌పీ అభ్యంతరం చెప్పింది. దాని దుష్ఫలితం అప్పుడే బయట పడింది.

మోతాదుకు మించి సీపేజీ వస్తున్నదనేది పోలవరం ప్రాజెక్టుకు నేడు గుదిబండగా తయారైంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాక ముందే వివిధ విభాగాల్లో నాణ్యత ప్రమాణాలు లేకపోవడం బహిర్గతం కావడం కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చుకొంటే అంతకన్నా కనాకష్టంగా వుంది.

పోలవరం నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలతో పాటు ప్రాజెక్టు ఉనికికే నిధులు గండం తీవ్రంగా వుండబోతోంది. ఎన్నికలు పూర్తయి కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువు తీరిన తర్వాతనే తిరిగి పనులు మొదలౌతాయి. ఒక వేళ రాష్ట్రంలో ప్రభుత్వం మారితే కాంట్రాక్టరు మార్పు తప్పని సరి అవుతుంది. ఒక వేళ తిరిగి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినా నిధులు గండం తప్పదు. 2017-18 షెడ్యూల్ రేట్ల ప్రకారం తొలి దశకైనా ప్రస్తుతమున్న రేట్ల ప్రకారం ఏ కాంట్రాక్టరు పనులు చేయలేరు. సాధారణంగా పోలవరం ప్రాజెక్టుయే కాదు ఏ సాగునీటి పథకమైనా పెరుగుతున్న ధరల మేరకు కనీసం ఏటా 15 శాతం వ్యయం పెరుగుతుంటాయి. ఏ సాగునీటి పథకమైనా నిర్దిష్ట సమయంలో పూర్తి కాకపోతే ఆ మేరకు వ్యయం పెరుగుతూ వుంటుంది. రాష్ట్రంలో పెండింగ్ పథకాలు ఆ మేరకు పెరిగాయి. అంతేకాదు. కొన్ని పథకాల మీద వ్యయం చేసిన మొత్తానికి మించి ప్రస్తుతం నిర్మాణ వ్యయం పెరిగి వుంది. ఈ సూత్రం పోలవరం ప్రాజెక్టుకూ వర్తిస్తుంది. సవాలక్ష షరతులతో పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేయడానికైనా కేంద్ర ప్రభుత్వం పెరిగిన నిర్మాణ వ్యయం భరిస్తుందా? అదీ 41.15 మీటర్ల ఎత్తు నిర్మాణం గురించే నిధులు గండం వెన్నాడితే 45.72 మీటర్లు ఎత్తుకు పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ఎవరు నిధులు ఇస్తారు? పూర్తి స్థాయిలో నిర్మాణం జరగడానికి ఎన్ని ఏళ్లు పడుతుందో. అప్పటికి 2017-18 నాటి షెడ్యూల్ రేట్లు ఏమేరకు పెరుగుతుందో ఊహకు కూడా అందదు. ఒక వేళ టీడీపీ- జనసేన ప్రభుత్వం వచ్చినా నిధుల సమస్య పరిష్కరించడం అసాధ్యం. ఒక్క చిన్న తప్పుతో పోలవరం ప్రాజెక్టు భవితవ్యం ప్రమాదంలోపడింది. 2019 లో అధికారం చేపట్టిన జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్టరు మార్పు చంద్రబాబు నాయుడును బోనులో నిలబెట్టేందుకు శూల శోధనతో కాలం గడపకుండా నిర్మాణ పనులు కొన సాగించి వుంటే కొంత మెరుగ్గా వుండేది.

విశ్రాంత పాత్రికేయులు
ఫోన్: 848394013

పెరియార్ సచ్ఛీరామాయణ్ ఒక కనువిప్పు

డాక్టర్ దేవరాజు మహారాజు

సుప్రసిద్ధ నాస్తికవాది, సంఘసంస్కర్త, ద్రవిడ ఉద్యమానికీ, ఆత్మగౌరవ ఉద్యమానికి రూపకల్పన చేసిన మహానుభావుడు, పెరియార్ ఇరోడ్ వెంకట రామస్వామి నాయకర్ (1879-1973) చేసిన గొప్పపనుల్లో 'కీమాయణం' రాయడం కూడా ఒకటి! ఆయన వాల్మీకి రామాయణానికి 1944లో 'కీమాయణం' అనే పేరుతో అరవై నాలుగు పేజీల వ్యాఖ్యానం ప్రకటించారు. అది వాల్మీకి రామాయణానికి హేతుబద్ధమైన విశ్లేషణ! ఆయన రాసింది తమిళంలో అయితే హిందీ, ఇంగ్లీషు ఇంకా ఇతర భారతీయ భాషల్లో అనువాదాలు వచ్చాయి. అవన్నీ పెరియార్ భావజాలాన్ని ఈ దేశ ప్రజలకు అందించాయి. హిందీలో 'సచ్చీ రామాయణ్' అని, ఇంగ్లీషులో =ాహీూాచీూావీ ా ు=ఖజు =జూాణ×చీ+ అని, తెలుగులో 'యదార్థ రామాయణం'- అనీ వచ్చాయి. రామాయణం అందరికీ తెలిసిందే కదా? ఇంకా, మళ్లీ పెరియార్ ఏం రాశారూ? అని కొందరికి అనుమానం రావచ్చు. రామాయణాలదేం ఉంది ? భారతీయ భాషల్లో వివిధ కాలాల్లో రాసిన రామాయణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఎవరి సృజనాత్మకతను వారు జోడించి, చిలువలు పలువలుగా రాసేసుకున్నారు. వేయి పడగలు రాసిన తెలుగు సంప్రదాయకవి విశ్వనాథ సత్యనారాయణ కూడా ఓ రామాయణమే రాసి, జ్ఞాన పీఠానికెక్కారు. అయితే, ఇవన్నీ ఒకే మూసలో పోసిన విధంగా... రాముడనే కల్పిత పాత్ర అయిన 'దేవుడి' మీద భక్తి పారవశ్యంలో రాసినవి. వీరంతా వాల్మీకి రామాయణాన్ని మార్చి, అందులో కొత్త సంగతులు చేర్చి రాశారు. రామాయణం రాయనివాడు కవే కాదు- అనే అభిప్రాయం గతంలో ఉండేది కూడా!

పెరియార్ నాస్తికుడు కనుక, వాల్మీకి రామాయణంలోని కథను, పాత్రల్ని, ఒక్కొక్కటిగా విశ్లేషించి పాఠకుల కళ్లు తెరిపించాడు. "రామాయణం కల్పిత గాథ" అని స్వయంగా శంకరాచార్యే ప్రకటించాడు. ఎందుకూ? అంటే- ఆయన దేవుడు - శంకరుడు. విష్ణు దేవుడి మహిమలు ఆయన ఒప్పుకోడు. ఆ వైరుధ్యం వల్లనే కదా వీరశైవులు, వీరవైష్ణవులు హోరాహోరి పోట్లాడుకునే వారు? దక్షిణ భారతదేశంలో ఉన్న ద్రావిడుల్ని లొంగ దీసుకోవడానికి, వారిని బానిసలుగా చేసుకోవడానికి ఉత్తరాది నుంచి వచ్చిన ఆర్యులు రాసుకున్న కల్పిత గాథ ఇది" అని డిస్కవరీ ఆఫ్ ఇండియాలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాశారు. ఈ అభిప్రాయాలన్నింటినీ పెరియార్ తన రచనలో తెలియజెపుతూనే, మరో విషయం కూడా నిర్ధారించారు. మన పంచతంత్రం, ఆరేబియన్ నైట్స్ కథల్లాగా రామాయణం కూడా కల్పిత గాథే- అని !! వాల్మీకి రామాయణంలో రాముడు దుర్మార్గుడని, మోసగాడని రాస్తే, తర్వాత కాలాలలో వచ్చిన వైదిక మత రచయితలు, అనువాదకులు- రాముడు మంచివాడని సచ్ఛీలుడని మార్చి రాసి, ఆ పాత్రకు దైవత్వం అంటగట్టారని అన్నాడు పెరియార్. అసలైతే రామాయణం ధర్మ స్థాపనకు సంబంధించిన రచనే కాదని కూడా కొట్టి పారేశాడు.

నిజమనేది ఎప్పుడూ ఒకటే ఉంటుంది. అబద్ధాలు మాత్రమే అనేకం ఉండే ఆస్కారముంది. రామాయణంలోని అబద్ధాలు పరిశీలిస్తే- రామభక్తులే మూర్ఛపోవాల్సిన పరిస్థితి ఉంది. ఉదాహరణకు వాల్మీకి రామాయణం ప్రకారం రాముడి తండ్రి దశరథుడికి 350 మంది భార్యలు. అదే కంభ రామాయణం ప్రకారం ఆయనకు 60 వేల మంది భార్యలు. ఇందులో ఏది నిజం? కైకేయిని వివాహం చేసుకునే సమయంలో దశరథుడు కైకేయి తండ్రికి ఒక వాగ్దానం చేశాడు. అదేమంటే, కైకేయికి పుట్టిన వాడికే పట్టాభిషేకం చేస్తానని! మరి కైకేయి పుత్రుడు భరతుడయినప్పుడు అతనికి పట్టాభిషేకం ఎందుకు చేయలేదు? తన దగ్గరే ఉంచుకుని, పరిపాలనకు సంబంధించిన అంశాలు ఎందుకు నేర్పించలేదూ? పైగా కైకేయి తండ్రి పాలించే కేకయ రాజ్యానికి పంపించాడెందుకూ? రాముడి పాదుకలు తీసుకుపోవడానికి భరతుడు అడవికి వెళ్లి రాముణ్ణి కలిసినప్పుడు -స్వయంగా రాముడే భరతుడికి ఈ విషయాలు గుర్తుచేశాడు. (ఆరణ్య కాండ 107 వ అధ్యాయం) దశరథుడు చేతకానివాడు, శక్తిహీనుడు ఆయినప్పుడు- మనిషి ఆకారంలో ఒక మాంసం ముద్దగా భావించినప్పుడు.. ఆయనకి నలుగురు కుమారులు ఎలా పుడతారు? పైగా, వారు దృఢకాయులు, సకల గుణ సంపన్నులు ఎలా అవుతారూ?భరతుడికే పట్టాభిషేకం చేస్తానని - దశరథుడు వాగ్దానం చేసిన విషయం తెలిసి కూడా- వశిష్ఠుడు అక్రమంగా 'రామపట్టాభిషేకం' ఎలా జరిపించాడూ ? కైకేయి చాలా ధైర్యవంతురాలు. రెండుసార్లు భర్త దశరథుడి ప్రాణాలు కాపాడుతుంది. అందుకు కృతజ్ఞతా పూర్వకంగానైనా దశరథుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సింది. కానీ, మాట తప్పి, కుట్ర పూరితంగా వ్యవహరించడమే కనిపిస్తోంది. ఆ రకంగా ఇచ్చిన మాటకు విలువ లేకుండా పోయింది. వాల్మీకి రామాయణంలోని ఇలాంటి విషయాల్నే పెరియార్ తన కీమాయణంలో ఎత్తి చూపాడు. గాంధీజీ కూడా 'నా రాముడు రామాయణంలో ఉన్న రాముడు కాదు' అని స్పష్టంగా ప్రకటించారు. వాల్మీకి కూడా తన రచనలో రాముడికి దైవత్వాన్ని అంటగంటలేదు. పెరియార్ మాత్రమేకాదు, ఎంతోమంది పరిశోధకులు, పండితులు, తత్త్వవేత్తలు రాముణ్ణి దేవుడి అవతారంగా భావించలేదు. ఇకపోతే రావణుడు వేదశాస్త్ర పురాణాలను మధించిన గొప్ప పండితుడని మూల రచయిత వాల్మీకే స్వయంగా పొగడిన విషయం పెరియార్ ఎత్తి చూపారు. ఒక బెంగాలీ రామాయణంలో రావణుడు బౌద్ధుడు అని కూడా ఉంది. ఏమైనా బ్రాహ్మణులు యాగాలు చేస్తూ,

సోమరసం తాగుతూ లెక్కలేనన్ని మూగజీవాల్ని బలి ఇస్తూ ఉండడాన్ని రావణుడు సహించలేకపోయాడు. ఎందుకంటే, రాజుగా ఆయన చేసిన చట్టాల్ని బ్రాహ్మణులు ఉల్లంఘించారు. యజ్ఞయాగాల పేరిట జంతు బలులుచేస్తూ వచ్చారు. వాటిని ఆపటానికి వచ్చిన తాటకిని రాముడు చంపాడు. శూద్రుడయి ఉండి, శంభుకుడు వేదాలు చదివాడని రాముడు అతడిని చంపాడు. (వాల్మీకి రామాయణం : ఉత్తరాకాండ 75వ అధ్యాయం) మరి ఇవన్నీ దుర్మార్గాలే కదా? రావణుడు సీతను ఎత్తుకు పోయాడు. అంటే- దానికి ఒక నేపథ్యం ఉంది. రావణుడికి ప్రీతిపాత్రమైన సోదరి శూర్పణఖ. ఆ శూర్పణఖ ముక్కు, చెవులు, స్తనాలు, జుట్టూ లక్ష్మణుడు కొసేస్తే - రావణుడు ఊరికే ఉండలేడు కదా? సీతను ఎత్తుకుపోయి, తన అశోక వనంలో అన్ని సౌకర్యాలు కల్పించి ఉంచాడు. సీతనే కాదు, రావణుడు అంతకు ముందు ఏ స్త్రీని ఎత్తుకుపోయి అనుభవించిన దాఖలాలు లేవు - అనే విషయం వాల్మీకి రామాయణం: సుందర కాండ 95వ అధ్యాయంలో ఉంది. ఆ విషయాన్నే పెరియార్ విపులంగా వివరించాడు. వాస్తవ దృక్కోణంలోంచి ఆలోచించే వారిని దుర్మార్గులుగా - దుర్మార్గంగా ఆలోచించే వారిని సన్మార్గులుగా తర్వాత కాలాలలో వైదిక మతస్థులు చిత్రీకరించి, అబద్ధాలు ప్రచారం చేయడాన్ని పెరియార్ తీవ్రంగా నిరసించారు. అర్ధరాత్రి లంకా నగరాన్ని దహించి, అమాయక పౌరుల్ని చంపి రావడం హనుమంతుడి సాహస కృత్యమా? వీరి గొడవలతో లంకలోని సామాన్య ప్రజలకు ఏమిటీ సంబంధం? యుద్ధంలో సుగ్రీవుణ్ణి చంపనని వాలి తన భార్యకు వాగ్దానం చేసి, తమ్ముడికి బుద్ధి చెపుదామని వస్తాడు. మరి సుగ్రీవుడేం చేశాడూ? రాముడి శరణుకోరి సొంత అన్నను చంపడంలో సహకరించమని వేడుకున్నాడు. అంటే కుట్ర పన్నాడు. కుట్రలో భాగమైన ధీరోదాత్తుడైన రాముడేం చేశాడూ? చెట్టు చాటున నిలబడి వాలిపైకి బాణం వదిలాడు. అది రాముడి సాహస కార్యమా? దొంగదెబ్బ తీయడం వీరుడి లక్షణమా? సరే, ఇది అలా ఉంచి విభీషణుడి సంగతి చూద్దాం ! సోదరుడైన రావణున్ని చంపించి, లంకకు రాజు కావాలనుకుని రాముడికి ఆత్మార్పణ చేసుకున్న విభీషణుడిది సాహస కార్యమా? ఏముంది రామాయణంలో నీతి, ధర్మం, న్యాయం? కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు లేనేలేవు. అలాంటప్పుడు ఇది గొప్ప ఉదాత్తమైన రచన ఎలా అవుతుందని పెరియార్ ప్రశ్నించడంలో, నిరసించడంలో న్యాయం ఉంది. వాస్తవాల్ని పక్కన పెట్టి, అభూత కల్పనల్ని నమ్మి భజనలు చేస్తామనే వారిని ఎవ్వరూ కాపాడలేరు.

బంగారు లేడి ఉండదని తెలిసి కూడా రాముడు దానికోసం ఎందుకు పరుగెత్తాడు?- అని ప్రశ్నించాడు కదా మన వేమన. వాల్మీకి రామాయణంలోని అయోధ్య కాండ 45వ అధ్యాయంలో సీత, లక్ష్మణున్ని నిందిస్తుంది. "ప్రమాదంలో ఉండి సహాయంకోసం పిలుస్తున్న నీ అన్న రాముడి పిలుపు వినిపించుకోకుండా నువ్వు ఇక్కడే, నా దగ్గరే ఎందుకు తిరుగుతున్నావూ? నన్ను అనుభవించాలన్న కోరికతోనేనా?" అని నిందారోపణ చేస్తుంది! సీత అగ్ని ప్రవేశంచేసి వచ్చినా, రాముడికి ఆమెపై అనుమానం పోదు. సీత పవిత్రురాలని వాల్మీకి చెప్పినా రాముడు నమ్మడు. పైగా గర్భిణిగా ఉన్న సీతను అడవిలో వదిలి రమ్మని లక్ష్మణున్ని ఆజ్ఞాపిస్తాడు. చివరికి ఆమె భూమిలో కూరుకుపోయి ప్రాణాలు వదులుతుంది. ఇలాంటి పనులు దయార్ద్రహృదయుడు, కరుణామయుడు చేయవల్సిన పనులేనా? అని పెరియార్ తన వ్యాఖ్యానంలో ప్రశ్నించారు. ఇవే కాదు ఇంకా చాలా చాలా అంశాలు లేవనెత్తారు. అయితే, చెప్పుకోవాల్సిన ముఖ్య విషయమేమంటే- 'కీమాయణం' హిందీలో 'సచ్చీరామాయణ్' పేరుతో ప్రసిద్ధి పొందింది.1967లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'సచ్చీ రామాయణ్' ను నిషేధించింది. ఆ నిషేధం చెల్లదని నాలుగేళ్ళ తర్వాత 1971లో అలహాబాదు హైకోర్టు కొట్టేసింది. జరిగిన అవమానం చాలని అప్పటి ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం ఊరుకుంటే పోయేది. దాన్ని ఇంకా పొడిగించి, తాము ఆ పుస్తకాన్ని నిషేధించడం సబబేనని సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకుంది. ఐదేళ్ళ తర్వాత 1976లో సుప్రీం కోర్టు తుది తీర్పు చెప్పింది. పెరియార్ కీమాయణం - సచ్చీరామాయణ్- వాల్మీకి రామాయణంపై ఆధారపడి రాసిందేననీ, అందువల్ల దాన్ని నిషేధించాల్సిన అవసరం కనబడడం లేదని జస్టిస్ కృష్ణయ్యర్ తీర్పిచ్చారు. ఆ రకంగా పెరియార్ వ్యాఖ్యానం విజయం సాధించింది. పెరియార్ వ్యాఖ్యానం సరైనదేనని, అది అందరూ చదవాల్సిన గ్రంథమని సుప్రీంకోర్టు చెప్పకనే చెప్పినట్టయ్యింది! ఇంకా చెప్పాలంటే వాస్తవాల్ని సుప్రీంకోర్టు బలపర్చినట్టయింది. అబద్ధాలే అధికారం చేజిక్కించుకుంటున్న ఈ కాలంలో.. ఒక విచిత్రం జరిగింది! ఈ దేశానికి అబద్ధాల 'కేరళ సినిమా' చూపించాలనుకున్న వారికి, ప్రజలు పిడిగుద్దులు గుద్ది 'కర్నాటక సినిమా' చూపించారు కదా? సామాన్య ప్రజలు మేల్కొంటున్నారు. నిజాలు గ్రహిస్తూ, చైతన్యవంతులవుతున్నారు!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత,
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

రాజకీయాల్లో పెరిగిన ధన ప్రభావం

ప్రజాకవి గోరేటి వెంకన్న

విశాలాంధ్ర-అవనిగడ్డ: ప్రస్తుత రాజకీయాల్లో ధన ప్రభావం పెరిగిందని, విలువలు మరింత దిగజారాయని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు, ప్రజాకవి గోరేటి వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానం మేరకు శనివారం మండలి స్వగృహానికి విచ్చేసిన వెంకన్న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల్లో తప్పితే ఉభయ రాష్ట్రాల ప్రజలు ఒకే తాటిపై ఉండాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశైలం వద్ద యురేనియం ప్రాజెక్టు నిర్మాణానికి కృషి జరుగుతుందని, అన్ని రంగాల్లో మార్కెట్ ప్రభావం పెరిగిందన్నారు. తెలుగు భాష విధ్వంసానికి కుట్ర జరుగుతోందని, తమిళభాష విధ్వంసం కుట్రలను అంగీకరించని తమిళులు ఉద్యమం ద్వారా ప్రతిఘటించారని గుర్తు చేశారు. అన్ని భాషల జీవన విధానం ఒకటేనని, భావజాలాన్ని ఎవరూ హతమార్చలేరని స్పష్టం చేశారు. క్యూబా, వియత్నాం దేశాల్లో తమమాతృ భాషలోనే వైద్యశాస్త్ర అభ్యాసం జరుగుతుందని తెలిపారు. కార్పొరేట్ శక్తుల పన్నాగాన్ని తిప్పికొట్టడానికి అన్ని భాషల వారు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వెంకన్న అన్నారు. తెలంగాణ శాసనమండలి సభ్యుడిగా తెలుగు భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఇప్పటికే సాహిత్య అకాడమీ పేరిట తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నానన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించతగ్గ మహోన్నత వ్యక్తి గోరేటి వెంకన్న అని కొనియాడారు. ఆయన కవిత్వం విననివారు, చదవనివారు తెలుగు నాట ఉండరన్నారు. గేయ కవిత్వాన్ని తెలుగువారికి అందించిన ఘనత గోరేటి వెంకన్నకే దక్కిందని ప్రశంసించారు. తాను అభిమానించే కవులలో గోరేటి వెంకన్న ఒకరన్నారు. గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, బోయి భీమన్న వంటి మహామహులకు చట్టసభల్లో స్థానం దక్కిందని గుర్తుచేశారు. అనంతరం గోరేటి వెంకన్నను మండలి బుద్ధప్రసాద్ దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. మాజీ శాసనసభ్యులు దేవినేని మల్లికార్జునరావు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, దివిసీమ కవి డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, ప్రముఖ జానపద గాయకులు సూరగం రామకృష్ణ, యాసం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రతిపక్ష నేతగా హామీఇచ్చి... అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను విస్మరించారని జగన్‌పై ఆరోపణలు చేశారు. రోడ్డున పడిన అగ్రిగోల్డ్ బాధితులు యువగళం పాదయాత్రలో తనను కలిసి...సమస్యలు విన్నవించారని పేర్కొన్నారు. చనిపోయిన 600 మంది అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు పరిహారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కనీసం ఆ కుటుంబాలను పరామర్శించలేదని, ఇదేనా మీ మానవత్వం అని నిలదీశారు. అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో ప్రతిపక్ష నేతగా జగన్ టీడీపీ ప్రభుత్వంపైనా, తనపైనా చేసిన ఆరోపణలను ఇంకా మర్చిపోలేదన్నారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే అగ్రిగోల్డ్ కుంభకోణం జరిగిందన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ ఆస్తులు 21 ఎకరాలు అటాచ్ చేసి, యాజమాన్యాన్ని అరెస్టు చేయించి బాధితులకు న్యాయం చేశామని గుర్తు చేశారు. అయినా తమపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఇప్పటికైనా స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్లను పరిష్కరించాలని లోకేశ్ కోరారు.

వైవీ సుబ్బారెడ్డికి నిరసన సెగ

గాజువాకలో నాగిరెడ్డికే టికెట్ ఇవ్వాలని అనుచరుల నినాదాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీలో టికెట్ల కుంపటి రాజుకుంది. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చేది లేదని సర్వేల పేరిట నిరాకరిస్తుం డటంపై ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల అనుచరులు అగ్గిమీద గుగ్గిలమై మండిపోతున్నారు. విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న తిప్పల నాగిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని అధిష్ఠానం ప్రకటించడంతో శనివారం గాజువాకలో టీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత సమావేశం రసాభాసగా మారింది. వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి నిరసన సెగ తగిలింది. నాగిరెడ్డి అనుచరులు సుబ్బారెడ్డిని ఘెరావ్ చేశారు. నాగిరెడ్డికి లేదా వారి కుమారులకు టికెట్ ఇవ్వాలని, ఇతరులకు టికెట్ ఇస్తే ఓడించి తీరుతామని కార్యకర్తలు, నాయకులు సుబ్బారెడ్డి ముందే నినాదాలు చేశారు. ఈ పరిస్థితిని, నిరసనలను ఊహించని సుబ్బారెడ్డి పోలీసుల సహాయంతో పరిస్థితిని అదుపులోకి తీసుకు రావాలని ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు, నాయకులు మరింత రెచ్చిపోయారు. నిరసన మధ్య సభ కొనసాగించలేక సుబ్బారెడ్డి వెళ్లిపోయారు. విశాఖ జిల్లాలో వైసీపీ నేతల రాజీనామాల పర్వం ఒక పక్క కొనసాగుతుండగా, మరోపక్క నియోజకవర్గాల మార్పు, టికెట్ల కోసం నిరసనపర్వం కొనసాగుతూనే ఉంది. గాజువాకలో మెజారిటీతో గెలుపొంది, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను సైతం ఓడించిన నాగిరెడ్డికి టికెట్ ఇవ్వకుండా నిరాకరిస్తారా అంటూ కార్యకర్తలు కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోయారు. నాగిరెడ్డికే మళ్లీ టికెట్ ప్రకటిస్తే కలిసికట్టుగా గెలిపించుకుంటామని, లేదంటే ఎవరు పోటీ చేసిన ఓటమి ఖాయమని తెగేసి చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడే ప్రయత్నం చేస్తూ నాగిరెడ్డి కుటుంబానికి సీఎం జగన్ అన్యాయం చేయరని, ఎమ్మెల్సీ కచ్చితంగా ఇస్తారని చెప్పినా కార్యకర్తలు ఊరుకోలేదు. దీంతో నియోజకవర్గ ప్రజల అభిప్రాయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానని, టికెట్ వచ్చేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో రసాభాస సద్దుమణిగింది.

వైసీపీకి తగిన బుద్ధి చెబుతాం

ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: బీసీలను దగా చేస్తున్న వైసీపీకి తగిన బుద్ధి చెబుతామని, ఉత్తరాం ధ్రలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కదని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తనకు ఎన్ని అవమానాలు జరిగినా 14 ఏళ్ల పాటు దిగమింగి వైసీపీ బలోపేతానికి కృషి చేశానని, సీఎం జగన్ చుట్టూ ఉన్న దద్దమ్మ సలహాదారుల వల్లే తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీ వల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వంశీ కృష్ణ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. శనివారం విశాఖలో హోటల్ మేఘాలయలో నిర్వహించిన మీడియా సమావేశంలో వంశీ కృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ నమ్మించి బీసీలను నట్టేట ముంచారని, 14 ఏళ్లు రాత్రి, పగలు రోడ్లపై పడుకుని పార్టీని కాపాడితే తనను ముఖ్యమంత్రి కలవడానికి కూడా ఇష్టపడకపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేసిం దన్నారు. మేయర్ పదవి ఆశ చూపి కార్పొరేటర్‌గా పోటీలో దింపి, ఓటమికి ఎన్నో ప్రయత్నాలు చేసినా, గెలిచి వచ్చిన తర్వాత మేయర్ పదవి ఇవ్వకుండా మొఖం చాటేసారని మండిపడ్డారు. నన్ను రెచ్చగొట్టారని, రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని వంశీకృష్ణ మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా తనపై విమర్శలు చేస్తున్నా రని, అందుకే మీడియా సమావేశం పెట్టానన్నారు. వైసీపీలో బీసీలను బాగా చూస్తే తామంతా ఎందుకు బయటకు వస్తామన్నారు. జగన్‌ను బూతులు తిట్టిన వారే ఇప్పుడు మంత్రులుగా ఉన్నారని, ఉత్తరాంధ్రలో వైసీపీ పదవులు వేసింది ఏయూ మాజీ వీసీ ప్రసాద్ రెడ్డి అని అన్నారు. పార్టీ మారేందుకు 10 మంది ఎమ్మెల్సీలు, 30 మంది కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. త్వరలోనే విశాఖ నుంచి జనసేనలోకి భారీగా చేరికలు ఉంటాయ న్నారు. తనను విశాఖ పార్లమెంటుకు, గాజువాక నుంచి పోటీ చేయమన్నా రని, తాను చేయనని చెప్పానన్నారు. తాను అడిగిన సీటు జనసేన ఇస్తుందని ఆశిస్తున్నట్లు వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన నేతలు శివశంకర్, మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

క్రాంతి విద్యార్థికి నంది పురస్కారం

అభినందించిన పాఠశాల యాజమాన్యం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన నంది నాటకోత్సవాలలో క్రాంతి హైస్కూల్ విద్యార్థి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు.నంది అవార్డు దక్కించుకున్నాడు. ఇందుకుగాను ప్రోత్సాహక పారితో షకంగా 25 వేల రూపాయల నగదు అందజేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన ప్రశంసా పత్రం, పాఠశాలకు జ్ఞాపిక అందజేశారు. నాటికలో ఉత్తమ ప్రదర్శన చేసిన కొడుకు పాత్రధారి రేపాని సంజయ్‌కు ఉత్తమ నటుడి అవార్డుతో పాటు నంది, 12,500 రూపాయల చెక్కు ప్రదానం చేశారు. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ టెలివిజన్, నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పోసాని కృష్ణమురళి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నంది అవార్డులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శనివారం స్కూల్‌లో సత్కరించింది. ఈనాటి సమాజంలో పిల్లలు పెద్దలను ఏ విధంగా అనుసరిస్తారు, ఏ విధంగా చెడు లక్షణాలు నేర్చుకుంటున్నారు అనే దానిపై రచించిన ఈ నాటిక 'తదాబాల్యం'లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు.

విద్యార్థులను ఉపాధ్యాయులు, ఇతరులు అభినందించారు. నాటిక దర్శకుడు, రచయిత, కవి పీఎస్ఎం, నాటిక ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొడదాం

మద్దతు పార్టీలకూ గుణపాఠం తప్పదు

విజయవాడ సదస్సులో వక్తలు

విశాలాంధ్ర- విజయవాడ: భారతరాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతిస్తున్న రాజకీయ పార్టీలను ఓడించాలని వక్తలు పిలుపునిచ్చారు. మోదీ హఠావో - దేశ్ బచావో నినాదంతో శనివారం విజయవాడ ఎగ్జిబిషన్ కమ్యూనిటీ హాలులో మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు అధ్యక్షతన సదస్సు జరిగింది. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, సామాజిక, గిరిజన, భారత్ బచావో, మేలుకో ఆంధ్రప్రదేశ్‌తో పాటు 72 సంఘాలు, సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. బీజేపీ, దాని మిత్రులను ఓడించడానికి అన్ని శక్తులు కలిసి రావాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ వేదిక నిర్మించడానికి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో జనవరి 12న విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సభ నిర్వహించాలని, దీనికి జాతీయనాయకులను ఆహ్వానించాలని నిర్ణయించారు. సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, రైతు నాయకులు జెట్టి గురునాథరావు, వామపక్ష పార్టీ నాయకులు సిహెంద్రి ఝాన్సీ, కిషోర్, ఆళ్ల గోపాల కృష్ణ, రమేశ్ పట్నాయక్, సి.భాస్కరరావు, ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ నాయకులు వి.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, రైతుసంఘం నాయకులు కేవీవీ ప్రసాద్, వై.కేశవరావు, సామాజిక సంఘాల నాయకులు మేళం భాగ్యరాజు, ముప్పాళ్ల సుబ్బారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు నారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ బండి శ్రీనివాసరావు, మహిళా నాయకులు రమాదేవి, సి.విజయ, సీతామహాలక్ష్మి, ఇతర సంఘాల నాయ కులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం జనవరి 12 సభ జయప్రదం కోసం వడ్డే శోభనాద్రీశ్వరరావు నాయకత్వంలో 43 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సదస్సులో నాయకులు మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయని బీజేపీపై మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మోదీ సర్కారు చేస్తున్న కుటిల ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. దేశానికి, రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్న బీజేపీకి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన మద్దతుగా నిలవడం అత్యంత బాధాకరమని వ్యాఖ్యానించారు. బీజేపీ, దాని మద్దతు పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

పది రోజుల్లో సీఆర్‌డీఏ పరిధిలోని

కౌలు రైతులకు బకాయిలు చెల్లించాలి

- లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలు
- తుపాను వలన నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: అమరావతి రాజధాని సీఆర్‌డీఏ పరిధిలోని కౌలు రైతులకు గత ఏడాది మే నెల నుంచి బకాయిల మొత్తం తక్షణమే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వాల మాటలు నమ్మి రైతులు తమ పొలాలను స్వచ్ఛందంగా ఇచ్చారని, గత ప్రభుత్వం, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తూ వారిని కూలీలుగా మార్చేశారని విమర్శించారు. పది రోజుల్లోపు కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు చెల్లించని పక్షంలో అఖిలపక్షం అధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని ముప్పాళ్ల హెచ్చరించారు. రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. మంగళగిరి ఆది నుంచి చేనేత కేంద్రంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలతో పాటు మైనారిటీలు, రైతులను కలిగిన రాష్ట్ర నడిబొడ్డున ఉన్నటువంటి నియోజకవర్గమని అన్నారు. అయితే ఈ నియోజకవర్గంతో పాటు రాజధాని అమరావతిని మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంత రైతాంగానికి కూడా మేలు చేస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి నిజస్వరూపం ఏమిటో ఇవ్వాళ ఆళ్ల రామకృష్ణారెడ్డి బయటపెట్టారన్నారు. రాజధానిలో రైతుల భూములకు కౌలు చెల్లించడం, రాజధానిలో ఉన్న భూమిలేని పేదలకు రూ.2,500 పెన్షన్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5 వేలు చేస్తామని చెప్పిన జగన్ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కౌలు తప్ప ఏ ఆదాయం లేని రైతుల బతుకులు ఎంతటి దారుణంగా ఉంటాయో సీఎం జగన్ తెలుసుకోవాలన్నారు. ఈ నూతన సంవత్సరం ప్రతిపక్ష పార్టీలన్నింటినీ కలుపుకొని అనేక ఉద్యమాలతో ముందుకు వెళతామని ముప్పాళ్ల తెలిపారు. రాజధాని పరిధిలో ఉన్న మంగళగిరి నియోజకవర్గాన్ని సీఎం జగన్ సుమారు రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పి, ఆ తర్వాత రూ.120 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. రాజధాని ప్రాంతంలో, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప ఆ కుటుంబాలను ఆదుకోవడం లేదన్నారు. రాష్ట్ర సంపద మొత్తం బడా కార్పొరేటర్లకు కట్టబెడుతోందని, ముఖ్యమంత్రి, అతని అనుచరులు దోచుకుంటున్నారని ముప్పాళ్ల మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలను నివారించాలంటే వారికి రుణమాఫీ తప్పనిసరిగా జరగాలని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెల్లోకి వెళుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీల జీతాన్ని పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సీఎం జగన్‌కు బటన్ నొక్కడం తప్పితే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటం లేదని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత

డిప్యూటీ సీఎంలు అంజాద్ బాషా, నారాయణస్వామి

విశాలాంధ్ర-నంద్యాల: సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధ్యమని, బడుగు, బలహీన వర్గాలకు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయిని పెంచారని ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణ స్వామి అన్నారు. నంద్యాలలో సామాజిక సాధికారత యాత్ర సందర్భంగా పట్టణంలోని సూరజ్ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. అంజాద్ బాషా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయ్యాయని, కానీ ఇప్పటి వరకు సామాజిక సాధికారత అన్నది ఒక నినాదంగానే మిగిపోయిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యా సాధికారత కోసం విప్లవాత్మక మార్పులు తెచ్చారని, నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన వంటి పథకాలను అందించారని తెలిపారు. నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆర్థిక స్థాయిని పెంచారని అన్నారు. కుల, మత, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా పారదర్శకతతో సంక్షేమ పథకాలు గడపగడపకు చేరేలా చేశారని చెప్పారు. మహిళల స్వావలంబన కోసం అనేక పథకాలు తీసుకొచ్చారని, అన్నింటా వారికి 50 శాతం భాగస్వామ్యం కల్పించారన్నారు. వీటన్నిటిని ప్రజలకు తెలిపేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు. నంద్యాలలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. నారాయణస్వామి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ముందుకు వస్తే టీడీపీ నాయకులు కోర్టులకు వెళుతూ అడ్డుతగులుతున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు అధికారంలో ఉన్నా పేదలకు చేసిందేమీలేదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నంద్యాల జిల్లా సమన్వయకర్త ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు హబిబుల్లా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా.శశికళరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, ఎంపీపీ శెట్టి ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

కొలికపూడికి ఏపీ సీఐడీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నాయకుడు కొలికపూడి శ్రీనివాసరావుకు ఏపీ సీఐడీ నోటీసులు జారీ అయ్యాయి. హైదరాబాద్, మాదాపూర్‌లోని కొలికపూడి ఇంటికి శనివారం సీఐడీ అధికారులు వెళ్లి నోటీసులు ఇచ్చారు. జనవరి 3న విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఇటీవల ఛానల్‌లో చర్చావేదికలో పాల్గొన్న కొలికపూడి... 'వ్యూహం' సినిమాపై మాట్లాడుతూ, దర్శకుడు రాంగోపాల్ వర్మ తల నరికి తెస్తే కోటి రూపాయల బహుమతిస్తానన్నారు. దీనిపై ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి రాంగోపాల్ వర్మ, నిర్మాత దాసరి కిరణ్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. రంగంలోకి దిగిన ఏపీ సీఐడీ అధికారులు ఆయనను అరెస్ట్ చేసేందుకు హైదరాబాద్ వెళ్లారు. అయితే కొలికపూడి ఇంట్లో లేకపోవడంతో చాలాసేపు ఎదురు చూసిన అధికారులు... ఆయన భార్యకు సమాచారం ఇచ్చారు.

జగన్‌ది మాఫియా పాలన

కాంగ్రెస్‌లోకి షర్మిల: గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి జగన్ మాఫియా పాలన నడిపిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై గిడుగు రుద్రరాజు విరుచుకుపడ్డారు. అవినీతి, అసమ్మతి, సొంత పార్టీ ఎమ్మెల్యేల తిరుగుబాటుతోనే వైసీపీ ప్రభుత్వం కొనసాగిందని విమర్శించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడిందని, ఏకపక్ష నిర్ణయాలతో వ్యవస్థలను దిగజార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా ఉద్యోగుల బదిలీలు ఉంటాయని, కానీ వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు, ఎంపీల బదిలీలు కొనసాగుతున్నాయని ఎద్దేవా చేశారు. నీతి, నిజాయతీలకు విలువ లేదని, ఆర్థిక స్థితి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జగన్ తీవ్ర అన్యాయం చేశారన్నారు. బీసీలు, దళితులపై సీఎం జగన్ సవతితల్లి ప్రేమ చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఏపీ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జి మాణిక్కం ఠాకూర్ జనవరి 8,9 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారని చెప్పారు. తనకున్న సమాచారం మేరకు త్వరలోనే షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరతారని రుద్రరాజు చెప్పారు. షర్మిలతో పాటు పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిని త్వరలోనే కలుస్తానని చెప్పారు. ఇప్పటికే సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణతో మాట్లాడామని, భావ సారూప్యత గల పార్టీలు, సంస్థలు, వ్యక్తులతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. డీకే శివకుమార్, మాజీ సీఎం చంద్రబాబు మధ్య రాజకీయ చర్చలు జరిగి ఉంటాయని అభిప్రాయపడ్డారు. లౌకిక పార్టీలా? మతోన్మాద పార్టీయా అనేది చంద్రబాబు, జగన్ తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, రాష్ట్ర, నగర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

వైసీపీలో ఒక్కరూ ఉండరు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: వైసీపీ నేతలందరికీ ఓటమి భయం పట్టుకుందని, వచ్చే ఎన్నికల్లో మునిగిపోయే నావలో ఉండలేక అందరూ బయటకు వస్తున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ తర్వాతే వైసీపీలో అసలైన ముసలం మొదలవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయని, జగన్ ఎటు ప్రయాణం చేస్తున్నాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్ మానసిక వ్యాధితో జగన్ బాధపడుతున్నారని అన్నారు. అమలుకు వీలుకాని హామీలతో అధికారంలోకి వచ్చాడని, 99.9 శాతం హామీలు అమలు చేశానని బూటకపు మాటలు చెబుతున్నాడని తెలిపారు. రాజధాని అమరావతికి తూట్లు పొడిచాడన్నారు. విశాఖ కార్యనిర్వాహక రాజధాని అని ఒక్క ఇటుక కూడా వెయ్యలేదని, కర్నూలు న్యాయ రాజధాని అని విస్మరించాడన్నారు. టీడీపీ హయాంలో పోలవరం 74 శాతం పూర్తయిందని, వైసీపీ హయాంలో 4 శాతం కూడా అవ్వలేదన్నారు. వైసీపీ ఘన కార్యాన్ని ఆ పార్టీ నుంచి బయటకొచ్చిన విశాఖలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ, సీతంరాజు సుధాకర్ కథలు కథలుగా చెబుతున్నారన్నారు. భవిష్యత్తుల్లో మరింతమంది వైసీపీ నుంచి బయటకు వస్తారని గంటా తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, టీడీపీ-జనసేన ప్రభుత్వం రానుందని చెప్పారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లోడగల కృష్ణ, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ చిక్కాల విజయబాబు, పొడుగు కుమార్, నడిగట్ల శంకరరావు, కోనేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.